Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 172 మేడ్చల్ మల్కాజ్‌గిరి 13 జూలై 2023 గురువారం పేజీలు : 4

## బంగారం ధర మళ్లీ పెరిగింది

నిన్న స్థిరంగా ఉన్న బంగారం ధర నేడు మళ్లీ పెరిగింది. దేశంలో బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల బంగారం ధరపై రూ.440 వరకూ పెరిగింది. ఇక వెండి ధరలు మాత్రం స్వల్పం(400 వరకూ)గా తగ్గాయి. 22 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) 47,750 కాగా.. 24 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) 52,090గా ఉంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి.

**బంగారం ధరలు..** హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.47,750.. 24 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.52,090విజయవాడలో 22క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.47,750.. 24 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.52,090




# సారు మనసులో ఎవరున్నారో!?

# గవర్నర్ కోటా చాన్స్ ఎవరికో..?

## రెండు ఎమ్మెల్సీ ఖాళీల భర్తీపై సీఎం కేసీఆర్ కసరత్తు

## రేసులో 20 మంది వరకు ఆశావహులు

హైదరాబాద్: సుమారు నెలన్నరకు పైగా ఖా ళీగా ఉన్న రెండు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి సంబంధించిన ప్రక్రియపై బీఆర్ఎస్ అధి నేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు కసరత్తు చేపట్టారు. అభ్యర్థులను ఖరారు చేసి ప్రతిపాదనలు పంపడంపై దృష్టి సారించారు. ఇద్దరి పేర్లను వారం రోజుల్లో నే గవర్నర్ ఆమోదానికి పంపే అవకాశ ముందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

ఈ ఏడాది మే 27న గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా పనిచేసిన ఫారూఖ్ హుస్సేన్, డి.రాజేశ్వర్ ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. వీరి స్థానంలో ఎవరినీ నామినేట్ చేయకపోవడంతో సుమారు నెలన్నర రోజులుగా ఈ రెండు పదవులు ఖాళీగా ఉన్నాయి.

**భారీ సంఖ్యలో ఆశావహులు :** మైనార్టీ వర్గానికి చెందిన ఫారూఖ్ హుస్సేన్, డి.రాజేశ్వర్ ఇద్దరూ తమకు మరోమారు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు క్రిస్టియన్ మై నారిటీ వర్గానికి చెందిన రాయిడిన్ రోచ్.. తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ పలు సంఘాలు చేసిన తీర్మానాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకె ళ్తున్నారు. వీరితో సుమారు 20 మంది నేతలు ఎమ్మె ల్సీ పదవులను ఆశిస్తుండగా పలువురి పేర్లు ముఖ్య మంత్రి పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, దాసోజు శ్రవణ్, పీ ఎల్ శ్రీనివాస్ తదితరుల పేర్లకు సంబంధించి వడ పోత జరుగుతున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నా యి. 40 మంది సభ్యులున్న శాసనమండలిలో ప్రస్తుతం గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలను మినహాయిస్తే ఇప్పట్లో ఇతర కోటాల్లో ఖాళీలు ఏర్పడే అవకాశం లేదు. సుమారు మూడొంతులకు పైగా మండలి సభ్యులు 2027 నుంచి 2029 మధ్యకాలంలో ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకోను న్నారు. వచ్చే ఏడాది ఒక్క ఖాళీ కూడా ఏర్పడే అవ కాశం లేకపోగా, 2025లో మాత్రం కేవలం ఇద్దరు ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకర్, టి.జీవన్‌రెడ్డి పదవీ విరమణ చేస్తారు. ఈ నేపథ్యంలోనే గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు గట్టి పోటీ నెలకొందని, ఈ కారణంగానే సీఎం కేసీఆర్ వీటి భర్తీ విషయంలో నెలన్నర రోజులుగా తాత్సారం చేస్తున్నట్లు చెబుతున్నారు.

**త్వరలో మండలికి కూచుకుళ్ల గుడ్‌బై! :** బీఆర్ఎస్ నాయకత్వంపై కొంతకాలంగా అసంతృప్తిగా ఉన్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి త్వరలో పార్టీని వీడేందుకు సిద్ధమవుతు న్నారు. కూచుకుళ్ల కుమారుడు నాగర్‌కర్నూల్ అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తుండటం, సిట్టింగ్ ఎమ్మె ల్యే మర్రి జనార్ధన్‌రెడ్డితో విభేదాల నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. కూచుకుళ్ల కుమారుడు ఇప్పటికే రాహుల్ సమ క్షంలో కాంగ్రెస్‌లో చేరగా, ఈనెల 20న కొల్లా పూర్‌లో జరిగే ప్రియాంకాగాంధీ సభలో ఆయ న కూడా చేరనున్నారు. ప్రస్తుతం అమెరికా నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తిరిగి వచ్చిన తర్వాత ఆయనతో చర్చించి ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయాలని కూచుకుళ్ల భావిస్తున్నట్టు తెలిసింది. అదే జరిగితే ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు ఈ ఏడాది చివర్లో కాని, వచ్చే ఏడాది ప్రారంభంలో కానీ ఈ ఖాళీ భర్తీకి ఎన్నిక జరిగే అవకాశం ఉంటుంది.

## చేరికల ఎఫెక్ట్: బిజీబిజీగా తెలంగాణ గాంధీభవన్



హైదరాబాద్ : తెలంగాణలోని గాంధీభవన్.. కొన్నిరోజులుగా కళకళలాడుతోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత.. వచ్చిన రెండు అసెంబ్లీ రెండు పార్లమెంటు ఎన్నికల్లోనూ పేలవమైన ఫలితాన్ని చూపించిన కాంగ్రెస్లో గత 8 ఏళ్లుగా పెద్దగా ఉత్సాహం కనిపించడం లేదు. పైగా ఎక్కడికక్కడ వివాదాలు విభేదాలతోనే నాయకులు కాలం గడుపుతున్నారు. అయితే.. ఇప్పుడు మరో నాలుగు మాసాల్లో ఎన్నికలుఉ న్న నేపథ్యంలో కాంగ్రెస్లో చేరికల ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇతర పార్టీల నుంచి వచ్చేవారికి కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచింది. దీంతో అనూహ్యంగా కాంగ్రెస్లో కొత్త జోష్ కనిపిస్తోందనే చర్చ ప్రారంభమైంది. ప్రధానంగా పొరుగున ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం దక్కించుకోవడం.. అదికూడా అంచనాలకు మించి.. సీట్లను రాబట్టుకున్న దరిమిలా.. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలనే పట్టుదల నాయకుల్లో కనిపిస్తోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి నుంచి ఇతర నాయకుల వరకు కూడా అందరూ కష్టిస్తున్నారనడంలో సందేహం లేదు. అదేసమయంలో రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకునే వ్యూహంలో భాగంగా.. ఇతర పార్టీల్లో అసంతృ ప్తులుగా ఉన్నవారిని కూడా చేర్చుకునే ప్రయత్నాలు చేపట్టారు. దీంతో ఇటీవల కాలంలో గాంధీ భవన్ బిజీబిజీగా మారడంతోపాటు.. నేతలతోనూ హడావుడిగా మారి.. కళకళలాడుతుండడం గమనార్హం. నమ్మకం కలుగుతోంది!ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్పై నేతల్లో నమ్మకం పెరిగిందనే సంకేతాలు వస్తున్నాయి. కర్ణాటకలో హిందూత్వ అజెండా అందుకున్న బీజేపీ చిత్తుగా ఓడిపోయింది. దీంతో తెలంగాణలోనూ బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదనే సంకేతాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే.. ఆ పార్టీలోకి చేరాలని అనుకున్నవారు.. ప్రస్తుతం ఉన్నవారు కూడా.. కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారనే చర్చ సాగుతోంది. పైగా.. ఖమ్మం నుంచి కీలకనేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరడంతో కాంగ్రెస్‌లో ఊపు వచ్చిందనే చెప్పాలి. మరింతగా పార్టీకి దోహద పడుతోందని అంటున్నారు. మొత్తంగా చూస్తే.. తెలంగాణ కాంగ్రెస్లో కొత్త ఊపు.. గాంధీ భవన్కు కొత్త కళ వచ్చాయని అంటున్నారు పరిశీలకులు.

## రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తే మీకేం సమస్య..

### రాహుల్‌గాంధీకి ఎమ్మెల్సీ కవిత సూటి ప్రశ్న



హైదరాబాద్ : వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్ అక్కర్లేదని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ కవిత సీరియస్ అయ్యారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే ఏ రాజకీయ పార్టీకి ఏ సమస్య వస్తుందో తనకు అర్థం కావడం లేదన్నారు. తెలంగాణ రైతాంగంపై మీకెందుకు అంత అక్కసు అని రాహుల్‌గాంధీని ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. రైతులకు మూడు గంటల కరెంట్ సరిపోతుందని టీపీసీసీ నేతలు చేసిన వ్యాఖ్యలు తనను దిగ్భ్రాంతికి గురిచేశాయని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. మీరు పాలిస్తున్న రాష్ట్రాల్లో ఉచిత కరెంట్ ఇవ్వడం చేతగాక.. తెలంగాణ రైతులపై మీ అక్కసు వెల్లగక్కుతారా? అని రాహుల్‌గాంధీని సూటిగా ప్రశ్నించారు. రైతుల ప్రయోజనాలను బీఆర్ఎస్ పార్టీ కాపాడుతుందని తెలిపారు. ప్రతి ఒక్క రైతుకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# క్యాడర్‌లో జోష్ నింపేలా...

# బీజేపీ 100 రోజుల యాక్షన్ ప్లాన్




హైదరాబాద్ : తెలంగాణా బీజేపీ హడావుడి మొదలుపెట్టింది. తెలంగాణా పార్టీ సహ ఇంచార్జ్ సునీల్ బన్సల్ ఆధ్వర్యం లో పార్టీ పదాదికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశం లో రాబోయే 100 రోజుల యాక్షన్ ప్లాన్ పై నేతలంతా చర్చించారు. బన్సల్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలోనూ బహిరంగ సభలు నిర్వహించాలని ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రముఖుల ను కలవటం మాట్లాడటం బీజేపీ లోకి ఆకర్షించే విషయం లో జోరు పెంచాల ని ఆదేశించారు. ఆగస్టు 15వ తేదీలోగా ఈ కార్యక్రమాలన్నీ జరిగిపోవాల ని స్పష్టంగా చెప్పారు. జిల్లాల అధ్యక్షులు మాజీ ఎంపీలు మాజీ ఎంఎల్ఏలు మాజీ ఎంఎల్సీలు జిల్లాల ఇన్చార్జిలతో మంగళవారం సమావేశం కాబోతున్నారు. ఈ సమావేశం లో బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ ను డిసైడ్ చేయబోతున్నారు. తెలంగాణా లో ఎజెండా కార్యాచరణ కూడా ఫైనల్ కాబోతోంది. సమావేశాలు తీర్మానాలు టార్గెట్లు అన్నీ బాగానే ఉన్నాయి. కానీ ఇవన్నీ చేయటానికి నేతలు ఎక్కడున్నారు ? ఉన్నవాళ్ళల్లో మునుపటి జోరెక్కడుంది ? నిజాని కి పార్టీలో జోరు అన్నది ఎప్పుడో ఎగిరిపోయింది. ఎప్పుడైతే ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో కల్వకుంట్ల కవిత పాత్ర నీరుగారిపోయిందో అప్పుడే బీజేపీ మీద దెబ్బ పడిపోయింది. క్విడ్ ప్రోకోలో భాగం గానే కవిత ను అరెస్టు చేయకుండా ఈడీ వదిలేసిందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అండ్ కో ఆరోపణలు మొదలుపెట్టారు. ఇదే సమయం లో నరేంద్ర మోడీ పై కేసీయార్ ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. అంతకుముందు వరకు మోడీ అంటేనే కేసీయార్ తారాజువ్వలా ఎగిరెగిరి పడిన విషయం అందరు చూసిందే. కవిత ను ఈడీ అరెస్టు చేయకపోవటం మోడీ పై కేసీఆర్ నోరిప్పకపోవటం ఒకే సమయం లో జరిగింది. దాంతో బీజేపీ-బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం జరిగిందని కాంగ్రెస్ నేతలు పదేపదే ఆరోపణ లతో విరుచుకుపడ్డారు. దాన్ని జనాలు కూడా నిజమే అని నమ్మారు. ఎప్పుడైతే బీజేపీ-బీఆర్ఎస్ ఒకటే అన్న విషయం జనాల్లోకి వెళ్ళిపోయిందో అప్పటినుండే బీజేపీ గ్రాఫ్ పడిపోయింది. ఇదే సమయం లో కర్నాటక లో కాంగ్రెస్ ఘన విజయం సాధించటంతో హస్తం నేతల్లో ఒక్కసారిగా జోష్ పెరిగిపోయింది. కాబట్టి మళ్ళీ మునుపటి ఉత్సాహం బీజేపీ లో రావాలంటే సాధ్యంకాదు. ఎందుకంటే ప్రతిచోట కవిత అరెస్టు అంశమే పెద్ద అడ్డుగోడగా నిలుస్తోంది.

# సంపాదకీయం

## ఉత్తరాదిన బీజేపీ వంద సీట్లు కోల్పోతుందా...?

బీజేపీని ఉత్తరాది పార్టీ అని అంటారు. ఆ పార్టీకి హిందీ బెల్ట్ లోనే ఎక్కువ బలం ఉంది. దేశంలో అత్యధిక ఎంపీ సీట్లు ఉత్తర్ ప్రదేశ్ లో ఉన్నాయి. ఇక్కడా ఎనభై ఎంపీ సీట్లు ఉంటే 2014 2019లలో రెండు సార్లూ బీజేపీ నూటికి తొంబై శాతం సీట్లను సాధించింది. ఈసారి పరిస్థితి అలా ఉండదు అని అంటున్నారు. యూపీలో బీజేపీ మెజారిటీ ఎంపీ సీట్లు సాధించినా అఖిలేష్ నాయకత్వంలోని ఎస్పీ కూడా గణనీయంగా సీట్లను తెచ్చుకుంటుంది అని సర్వేలు చెబుతున్నాయి. అలాగే మధ్యప్రదేశ్ లో బీజేపీకి ఈసారి సీట్లు తగ్గుతాయని అంటున్నారు. 29 ఎంపీ సీట్లు ఉంటే బీజేపీకి 28 సీట్లు దక్కాయి. ఒకే ఒక్క సీటు కాంగ్రెస్ కి లభించింది. ఈసారి చూస్తే సీన్ రివర్స్ అవుతుంది అని అంటున్నారు. దానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యప్రదేశ్ లో ఏర్పడితే దాన్ని కూల్చి బీజేపీ అధికారంలోకి రావడం ఇలా వరసగా పదేళ్ళ పాలన చేసిన రాష్ట్ర బీజేపీ మీద కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉంటే కచ్చితంగా సగానికి సగం సీట్లు పోతాయని అంటున్నారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ బాగా పుంజుకుంది అని అంటున్నారు. ఇక బీహార్ విషయానికి వస్తే 2019 ఎన్నికల్లో మొత్తం 40 సీట్లకు గానూ 39 సీట్లను గెలుచుకుంది. జేడీయూ పొత్తుతో ఈ సీట్లను బీజేపీ దక్కించుకుంది. ఇపుడు జేడీయూ బీజేపీ నుంచి వేరు పడింది. ఆర్జేడీతో చేతులు కలిపింది. దాంతో బీహార్ లో అతి పెద్ద విపక్ష కూటమి అవతరించింది. దాంతో ఈసారి మెజారిటీ సీట్లు ఆ కూటమికి రావచ్చు అంటున్నారు. అదే జరిగితే బీజేపీ కచ్చితంగా సగానికి సగం సీట్లు పోగొట్టుకుంటుంది. ఢిల్లీ నుంచి ఏడు ఎంపీ సీట్లు బీజేపీ 2019లో గెలుచుకుంది. ఈసారి ఆప్ బలం పెరిగింది దాంతో ఇక్కడ బీజేపీ బండికి బ్రేకులు పడే అవకాశం ఉంది అంటున్నారు. అలాగే హిమాచల్ ప్రదేశ్ ఉత్తరాఖండ్ గుజరాత్ లతో పాటు మహారాష్ట్ర లలో బీజేపీ సీట్లు బాగా తగ్గిపోతాయని అంటున్నారు. మహారాష్ట్రలో 48 ఎంపీ సీట్లు ఉంటే బీజేపీ శివసేన పోటీ చేసి అత్యధిక సీట్లు సాధించాయి. ఈసారి శివసేన ఉండదు విపక్షంలో ఉంది. అయితే అజిత్ పవార్ ఎన్సీపీ వైపుకు వచ్చినా శరద్ పవార్ హవాతో బీజేపీ కూటమికి చుక్కలు చూపించవచ్చు అని అంటున్నారు. రాజస్థాన్ లో కూడా అసెంబ్లీ గెలిస్తే బీజేపీకి మేలు జరుగుతుంది కానీ ఒకవేళ కాంగ్రెస్ దూకుడు చేస్తే మాత్రం ఆ ఆశలు ఉండవు. ఇక్కడ కూడా బీజేపీ సీట్లను చాలా వరకూ 2024లో కోల్పోతుంది అని అంటున్నారు. ఇలా లెక్క వేసుకుంటే తక్కువలో తక్కువ వంద సీట్లకు కమలం పార్టీకి గండి పడుతుంది అని అంటున్నారు. అదే జరిగితే బీజేపీ అధికారానికి ఆమడ దూరంలో ఉండాల్సిందే అంటున్నారు. బీజేపీకి 2019లో సొంతంగా 304 సీట్లు వచ్చాయి. ఇపుడు ఆ సంఖ్య 200 కి పడిపోతే అధికారంలోకి వచ్చేందుకు మ్యాజిక్ ఫిగర్ గా ఉన్న 273 కి 73 సీట్లు తక్కువ పడతాయి. ఎన్నికల తరువాత మిత్రులతో సర్కార్ ఏర్పాటు చేయాలనుకున్నా ఆనాటికి ఎవరు మిత్రులుగా ఉంటారో కూడా తెలియదు కాబట్టి బీజేపీలో కలవరం అయితే రేగుతోంది అని అంటున్నారు. బీజేపీ బీహార్ మహారాష్ట్ర మధ్యప్రదేశ్ రాజస్థాన్ యూపీల మీద ప్రత్యేక ఫోకస్ పెడుతోంది. ఇక్కడ సీట్లను పోగొట్టుకోకూడదని గట్టి పట్టుదలగా ఉంది.

# అర్హులైనా అందని ఆసరా



జగిత్యాల: మూడేళ్ల తర్వాత ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన 'ఆసరా' పింఛన్లలో అర్హులకు మొండిచెయ్యే ఎదురైంది. 57-64 ఏళ్ల వయసు వారికి మీసేవ దరఖాస్తు జాబితాలో చోటు దక్కలేదు. దీంతో మండల కార్యాలయాలకు పరుగు తీస్తున్నారు. మంజూరు జాబితా మండలాలకు రాకపోవడంతో తమ వద్ద స్పష్టమైన సమాచారం లేదంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఈ విషయమై జిల్లాలోని ఉన్నతాధికారులను ఆశ్రయించినా ఫలితం లేదని బాధితులు వాపోతున్నారు. జిల్లాలో అర్హులైన మరికొందరు నిరుపేదలు నిరీక్షించాల్సి వస్తోంది. అనారోగ్యంతో మంచానికే పరిమితమై, పూట గడవని పండుటాలకు అధికారుల తీరు ఆందోళన కలిగిస్తోంది. వయసు నిండినా ఎందుకు పింఛను రాలేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో వడబోత

జిల్లాలో 57 ఏళ్లు నిండిన వారు దాదాపు 32 వేల మంది పింఛను కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వాటిని జిల్లా స్థాయిలో అధికారులు సమగ్రంగా పరిశీలించి, క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. మండల స్థాయిలో ఎంపీడీవోల పర్యవేక్షణలో కార్యదర్శులు, సెర్ప్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఇప్పటివరకు ఏదైనా పింఛన్ పొందుతున్నారా? ఓటరు జాబితాలో ఎంత వయసు ఉంది? 3 ఎకరాల కంటే ఎక్కువ భూమి కలిగి ఉన్నారు. కుటుంబంలో వారసులెవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారా? తదితర వివరాలు నమోదు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో దరఖాస్తులను ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో వడబోత చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

కొత్తగా 16,531 మందికి లబ్ధి

జిల్లాలో 57-64 ఏళ్ల వయసు వారు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు ఆధార్, బ్యాంకు ఖాతా, ఇతర ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోగా దాదాపు 32 వేల దరఖాస్తులు వచ్చాయి. కాగా కొత్త పింఛన్ల కోసం దాదాపు మూడేళ్లుగా నిరీక్షిస్తున్నారు. ఎట్టకేలకు ఇటీవల మంజూరు జాబితా విడుదల చేయగా ఇందులో 16,531 మందికి మాత్రమే అవకాశం దక్కింది. వీటితో పాటు ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న వితంతు, దివ్యాంగ, కులవృత్తులు, ఇతర కేటగిరీలకు చెందిన మరో 10,025 కలుపుకుని మొత్తం 26,556 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. దీంతో ఇకపై జిల్లావ్యాప్తంగా కొత్తవి, పాతవి కలుపుకొని మొత్తం 75,54 మంది లబ్ధిదారులు ప్రతి నెలా పింఛను పొందనున్నారు.

లబ్ధిదారులకు గుర్తింపు కార్డులు

ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛను లబ్ధిదారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఏటీఎం సైజ్‌లోని కార్డులు విడతల వారీగా జిల్లాకు చేరుతుండగా మండలాలకు తరలిస్తున్నారు. అయితే గుర్తింపు కార్డులు రాని వారు నిరీక్షిస్తున్నారు. మీసేవలో దరఖాస్తు చేసుకునే ఐచ్ఛికం రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.రాష్ట్ర స్థాయిలోనే జాబితా సిద్ధం చేశారు: శ్రీధర్, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖాధికారి

ఆన్‌లైన్ ద్వారా స్వీకరించిన దరఖాస్తులను జిల్లా స్థాయిలో పరిశీలించి జాబితాపై ఉన్నతాధికారులకు నివేదించాం. రాష్ట్ర స్థాయిలోనే జాబితా సిద్ధం చేశారు. మంజూరు చేసిన వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్నాం. కొందరు తమకు పింఛను రాలేదని ఫిర్యాదు చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతి వచ్చాకనే కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి.

# రాత్రివేళ.. గుట్ట మట్టి మాయం



గంగాధర : గంగాధర ప్రధాన కూడలిలోని వంటశాల గుట్టను అక్రమార్కులు వదిలిపెట్టడం లేదు. పొక్లెయిన్ యంత్రాలతో గుట్టను తవ్వి మట్టిని అమ్ముకుంటున్నారు. రాత్రిపూట తవ్వుతూ వాణిజ్య అవసరాలకు మట్టిని అమ్ముకుంటూ కాసులు జేబులో వేసుకుంటున్నారు. వాణిజ్యపరంగా గంగాధర ప్రధాన కూడలి అభివృద్ధి చెందడంతో రియల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. వంటశాల గుట్ట సమీపంలో వ్యాపారులు మూడెకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసి ప్లాట్లుగా చేసి అమ్ముకుంటున్నారు. లోతుగా ఉన్న భూమిని ప్లాట్లుగా అమ్మితే కొనుగోలు చేయరని సమీపంలోనే ఉన్న వంటశాల గుట్ట మట్టిని సదరు స్థలంలోకి అక్రమంగా తరలించుకుపోతున్నారు. రూ. 5 లక్షలకు కాంట్రాక్టు దక్కించుకున్న ఓ పొక్లెయిన్ వ్యాపారి ట్రాక్టర్లతో రాత్రిపూట గుట్టమట్టి కొల్లగొడుతూ సొమ్ము చేసుకున్నాడు. ఇప్పటికే దాదాపు రెండు వేల ట్రాక్టర్ ట్రిప్పుల మట్టి అక్రమంగా రవాణా చేశాడు. అక్రమ తవ్వకాలపై స్థానికులు పోలీసులకు బుధవారం రాత్రి సమాచారం అందించడంతో పొక్లెయిన్ పోలీసు ఠాణాకు తరలించారు. ఎలాంటి కేసులు, జరిమానాలు విధించకుండానే యంత్రాన్ని వదిలిపెట్టడం అనుమానాలకు తావిస్తోంది. మార్చి నెలలోనూ ఇలాగే గుట్ట మట్టి మాయంపై అప్పట్లో 'ఈనాడు'లో వరస కథనాలు ప్రచురితం కావడంతో గంగాధర, కొడిమ్యాల మండలాల రెవెన్యూ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు. కొన్ని నెలలపాటు అక్రమ తవ్వకాలు నిలిచిపోగా గత 15 రోజుల నుంచి రాత్రిపూట గుట్ట మట్టి అక్రమంగా తవ్వి వాణిజ్య అవసరాలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. తహసీల్దారు శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా గుట్ట మట్టి తవ్వకాలపై మా దృష్టికి రాలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టా స్థలంలో మట్టి తవ్వుకుంటున్నామని యజమాని కాగితాలు చూపించడంతో పొక్లెయిన్ యంత్రాన్ని వదిలిపెట్టినట్లు ఎస్సై రాజు తెలిపారు.

# అక్రమ అంతస్థులు.. భవిష్యత్తులో అవస్థలు

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో బహుళ అంతస్తులు, భవన నిర్మాణాల జోరు పెరిగింది. శివారు ప్రాంతాల్లో కొత్త నిర్మాణాల సంఖ్య విస్తరిస్తోంది. అయితే సొంతింటి కల నెరవేర్చుకునే ముందు ప్లాట్, స్థలం, భవనం కొనుగోలు చేసేందుకు ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాల్సిన అవసరముంది. రహదారులను ఆక్రమించడం, సర్వే నెంబర్లు గోల్‌మాల్ చేయడం, సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించడం వంటి విషయల్లో ఫిర్యాదులు అధికమయ్యాయి. అయినప్పటికీ ఇష్టానుసారంగా భవనాలు నిర్మిస్తుండగా కొత్త పురపాలక చట్టం ప్రకారం కూల్చే అధికారముంది. బహుళ అంతస్తులలో ప్లాట్లు కొనుగోలు చేసే ముందు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. హడావుడిగా తక్కువ మొత్తానికే ప్లాట్లు ఇస్తున్నారని ముందుకెళ్తే మోసపోయే ప్రమాదముంది.రిజిస్ట్రేషన్‌తో పాటు లింకు డాక్యుమెంట్లు పరిశీలించుకోవాలి. స్థల యజమాని బహుళ అంతస్థ నిర్మించకపోతే రికార్డుల ప్రకారం బిల్డర్‌కు లైసెన్స్ ఉందా లేదా అని తనిఖీ చేసుకోవాలి. సిల్ట్‌5 అంతస్థులుండీ వెయ్యి చదరపు మీటర్లు, భవన ఎత్తు 15మీటర్లు దాట కూడదు. సిల్ట్‌5 దాటితే హైదరాబాద్ నుంచి అనుమతి తీసుకోవాలి. నిర్మాణానికి భూమి అనుకూలంగా ఉందా లేదా తెలుసుకోవడానికి భూపరీక్షలు జరపాలి. అపార్టుమెంట్లలో 8 యూనిట్లు దాటితే కచ్చితంగా రియల్ ఎస్టేట్ రెగ్యులరేటరీ అథారిటీ (రేరా) అనుమతి తప్పనిసరిగా ఉండాలి. 30ఫీట్ల రోడ్డు ఉండాలి. సెట్‌బ్యాక్ స్థల విస్తీర్ణం బట్టీ ఉంటుంది. పార్కింగ్ స్థలంలో ఎలాంటివి నిర్మించకూడదు. వాచ్‌మెన్ గది ఒక్కటే ఉండాలి.ర్మాణం పూర్తయిన తర్వాత స్వాధీనపత్రం లేకపోతే ప్రభుత్వం జీఎస్టీ విధిస్తోంది. అప్రూవల్ ప్లాన్ ప్రకారం నిర్మిస్తే 10శాతం మార్టిగేజ్ విడుదల చేస్తారు. అనధికారికంగా నిర్మిస్తే రెట్టింపు ఆస్తిపన్ను వేస్తారు.

చర్యలు తీసుకుంటున్నాం

జిల్లాలోని నగర, మున్సిపాలిటీల్లో టీఎస్‌బీపాస్‌కు ఫిర్యాదుల సంఖ్య పెరుగుతున్నాయి. కరీంనగర్ నగరపాలికలోనే 130ఫిర్యాదులు రాగా అందులో 50కి పైగా కూల్చివేసేందుకు చర్యలు తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ నిర్ణయించింది. ఇప్పటివరకు 14 భవనాలను కూల్చివేశారు. నాలుగు చోట్ల మూడు అంతస్తుల శ్లాబులకు రంధ్రాలు చేసి పనికి రాకుండా చేయగా మిగతా ప్రాంతాల్లో ప్రహరీలు, గదులు తొలగించారు. ఏదీ ఏమైనా సరే పక్కా అనుమతులు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి చిక్కులుండవనే విషయాన్ని కొనుగోలుదారులు, భవన, నిర్మాణదారులు గుర్తుంచుకోవాలి.

కఠిన నిబంధనలు కొత్త పురపాలక చట్టం-2019 ప్రకారం అక్రమ నిర్మాణాలపై వచ్చే ఫిర్యాదులపై విచారణ జరిపించి, నిర్ధారణ అయితే ఎలాంటి నోటీసు లేకుండానే చర్యలు తీసుకునే అవకాశముంది. ఎవరైనా యజమాని ఉద్దేశపూర్వకంగా నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా నిర్మిస్తే కూల్చివేతతో పాటు స్థలం విలువలో 25శాతం జరిమానా విధించడం, మూడేళ్ల జైలు శిక్ష పడేలా చట్టంలో రూపొందించారు. ఈ చట్టాన్ని పర్యవేక్షించడంతో పాటు నియంత్రణ చర్యలు చేపట్టేందుకు జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశారు. ?

# మారిన పంథా.. దర్జాగ్గా దందా

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గతంలో అటవీ ప్రాంతాల్లో విలువైన వృక్షాలను నరికి అక్రమార్కులు రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేసేవాళ్లు. ఈ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అటవీశాఖ సరికొత్త ప్రణాళికతో ముందుకెళ్తున్నా దందా మాత్రం ఆగడం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 10 లక్షల ఎకరాలు, ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల అటవీ విస్తీర్ణం ఉంది. భద్రాద్రి జిల్లాలో ఆరు అటవీ డివిజన్లు, 23 రేంజ్‌లున్నాయి. ఖమ్మం జిల్లాలో 2 డివిజన్లు, ఆరు రేంజ్‌లు ఉన్నాయి. ఓ వైపు పోడు భూముల విస్తీర్ణం పెరుగుదల, మరోవైపు అక్రమ కలప రవాణాతో పూర్వ ఖమ్మం జిల్లాలో అటవీ విస్తీర్ణం గణనీయంగా తగ్గుతోంది.

స్మగ్లర్లతో చేతులు కలిపి..

ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ కలప రవాణాకు అడ్డుకట్ట పడటంలేదు. ఈ వ్యవహారంలో అటవీశాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది అక్రమార్కులకు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కలప మాఫియా పగలు అడవిని జల్లెడ పట్టి విలువైన వృక్షాలను గుర్తిస్తున్నారు. రాత్రివేళల్లో ఆయా ప్రాంతాలకు కూలీలు, ముఠాలతో వెళ్లి వాటిని నేలమట్టం చేస్తున్నారు. ప్రధానంగా నారవేప, టేకు చెట్లపై కన్నేస్తున్నారు. మారుమూల అటవీ ప్రాంతాల్లో కోత యంత్రాలు పెట్టి మరీ భారీ చెట్లను నేలకూల్చేస్తున్నారు. అక్కడే దుంగలుగా చేసి అక్రమంగా తరలిస్తున్నారు. ఆయా రేంజ్‌లు, చెక్ పోస్టుల పరిధిలో వాహనాలు ఆపకుండా ముందే జాగ్రత్త పడుతున్నారు.

డిపోల నుంచే తరలింపు..

చాలాచోట్ల టింబర్ డిపోల నుంచే నేరుగా ఇటుక బట్టీలకు కలప తరలిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి, ఇల్లెందు, భద్రాచలం, అశ్వారావుపేట, అశ్వాపురం, మణుగూరు, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఈ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఖమ్మం జిల్లాలోని కొన్ని మండలాల్లో విచ్చలవిడిగా కలప రవాణా చేస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల ఈ వ్యవహారం అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

ఇంటి దొంగల బాగోతమిలా..

లి టేకులపల్లి పరిధి చాతకొండ రేంజ్‌లోని సిద్ధారం, ఇల్లెందు రేంజ్ కొల్లాపురం బీట్ పరిధిలో నారవేప దుంగల నరికివేత వెనుక అటవీశాఖలోని కొందరి ప్రమేయం ఉందన్న వాదనలున్నాయి. ఇవే ఆరోపణలతో ఇటీవల నలుగురిపై వేటు పడింది.

లిసిద్ధారం అడవుల్లో నుంచి రెండు వాహనాలలో నారవేప దుంగలను తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. ఆ తర్వాత అక్రమార్కులతో మిలాఖత్ అయిన వ్యవహారం సీసీ కెమెరాల్లో నిక్షిప్తం కావడంతో వారిపై వేటు పడింది.

లి చర్ల మండలం వెంకటచెరువు అటవీ ప్రాంతాల్లో వందేళ్ల టేకు చెట్లను నరుకుతుండగా కూంబింగ్‌కు వెళ్లిన పోలీసులు పట్టుకున్నారు. సంబంధిత అటవీ సిబ్బందిపై వేటు పడింది.

లి దుమ్ముగూడెం మండలం పర్ణశాల బీట్ పరిధిలో అక్రమంగా కలప తరలిస్తున్న వాహనాలను పట్టుకోగా ఇద్దరు సిబ్బంది పాత్ర ఉన్నట్లు తేలడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. అశ్వాపురం మండలం గొందిగూడెం, రామవరం రేంజ్‌ల పరిధిలో అక్రమ కలప రవాణాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలపై పలువురు సిబ్బందిపై వేటు పడింది.

అడవుల్లో చెట్లు నరికివేతకు తావులేకుండా రేంజ్‌ల వారీగా చర్యలు చేపట్టాం. రెవెన్యూ పట్టాలున్న భూములు, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలున్న భూముల్లోనూ చెట్లు నరికినా చర్యలు తప్పవు. అక్రమ కలప రవాణాలో అధికారులు, సిబ్బంది పాత్ర ఉంటే చర్యలు తీసుకుంటున్నాం. - లక్ష్మణ్ రంజిత్ నాయక్, జిల్లా అటవీశాఖ అధికారి

# నిర్లక్ష్యంతో కు. ని.ఆపరేషాన్

ఖమ్మం : లి జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ మండలానికి చెందిన మహిళ ఇద్దరు పిల్లల తర్వాత ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ట్యూబెకమీ చేయించుకుంది. శస్త్రచికిత్స చేసినపుడు కుట్టు వేసిన భాగంలో సమస్య తలెత్తడంలో వైద్యులను సంప్రదించగా కొద్ది రోజుల పాటు చికిత్స తీసుకున్న తర్వాత కోలుకుంది.

లి జిల్లా ఆస్పత్రిలో కు.ని. శస్త్రచికిత్స చేయించుకున్న ఓ మహిళ వారం రోజులకే అనారోగ్యం బారి పడటంతో వైద్యులను సంప్రదించింది. కుట్లు వేసిన దగ్గర ఇన్‌ఫెక్షన్ సోకడంతో చికిత్స తీసుకుంది.

..ఇలాంటి సమస్యలతో పలువురు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. కుటుంబ నియంత్రణ చికిత్సల సమయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం, బాధితులు వైద్యుల సూచనలను పాటించకపోవడంతో అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు.

డీపీఎల్ చికిత్సలు నిలిపివేత

కొవిడ్‌కు ముందు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి డీపీఎల్ పద్ధతిలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేసేవారు. జనన రేటు 1.8గా నమోదు కావడంతో ప్రస్తుతం శిబిరాల నిర్వహణ జరగడం లేదు. ఈ పరిస్థితుల్లో జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని పీపీయూనిట్‌లలో, సీహెచ్‌సీల్లో కుటుంబ నియంత్రణ చికిత్సలు కొనసాగుతున్నాయి. ఇద్దరు పిల్లల తర్వాత అనేకమంది కాన్పుల సమయంలోనే కు.ని. ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. కాగా రద్దీ సమయంలో ఆపరేషన్ల తీరు గందరగోళంగా ఉంటోంది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం బాధితులను ఇబ్బందులు పాలుచేస్తోంది. జిల్లా ఆస్పత్రిలో రోజుకు కనీసం ఐదు నుంచి పది శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. అయితే సీహెచ్‌సీల్లో నిపుణుల కొరత కారణంగా విధిగా జరగడం లేదు. ఈ కేంద్రాల్లో సదుపాయాలు కూడా నామమాత్రంగా ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో కు.ని ఆపరేషన్లను ఆదాయ వనరుగా మార్చుకున్న కొందరు వైద్యులు చికిత్సల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించడం లేదు. కనీస సదుపాయాలు లేని థియేటర్లలో ఈ ప్రక్రియను చేపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అవగాహన లేమితో అనర్థాలు

కు.ని. శస్త్రచికిత్సల తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఈ విషయంలో వైద్య సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఇంటికి వెళ్లిన తర్వాత వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలు పాటించకపోవడం, పోషకాహారం వంటి విషయాల్లో నిర్లక్ష్యం వెరసి అనారోగ్య సమస్యలకు దారితీస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు.

లి జిల్లాలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తలేదు. చికిత్సల తర్వాత ఇబ్బందులు పడుతూ ఎవరూ ఆస్పత్రులకు రాలేదు. ప్రస్తుత విధానంలో అలాంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం లేదు. కేవలం ఒక్క కుట్టుతోనే ట్యూబెక్టమీ చేసే విధానం కొనసాగుతోంది. -డాక్టర్ మాలతి, జిల్లా వైద్యాధికారి

# కృషి ఫలించింది.. ప్రతిష్ఠ పెరిగింది

వరంగల్ : కాకతీయ విశ్వవిద్యాలయం.. ఉత్తర తెలంగాణలో సంప్రదాయ విశ్వవిద్యాలయాల్లో ఓయూ తర్వాత అతిపెద్దది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఉన్నత విద్యను అందిస్తోంది. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోంది.. బోధన, పరిశోధన రంగాల్లో పరుగులు పెడుతోంది. దేశవిదేశాల నుంచి విద్యానిపుణులు తీసుకొచ్చి సెమినార్లు నిర్వహిస్తోంది. అంతర్జాతీయ సదస్సులకు వేదికగా మారింది.. వివిధ విభాగాల్లో జాతీయ పురస్కారాలు సొంతం చేసుకుంది. తాజాగా జాతీయ స్థాయిలో న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించింది.

దేశంలోని ఉన్నత విద్యాసంస్థలకు ప్రమాణాలను అంచనా వేసి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) గ్రేడ్‌లను ప్రకటిస్తుంది. జాతీయస్థాయిలో కాకతీయ విశ్వవిద్యాలయం ప్రథమంగా ఏ ప్లస్ సాధించింది. కేయూలో బోధన, పరిశోధన రంగాలు మరింత ప్రగతిని సాధించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు సాధిస్తుందని కేయూ వర్గాలు అంటున్నాయి.

**14 ఏళ్ల తర్వాత**

జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయాలకు న్యాక్ ప్రత్యేకమైన గుర్తింపు ఇస్తోంది. 2003లో అప్పటి కేయూ ఉప కులపతి ఆచార్య చంద్రకాంత్ కొకాటే నేతృత్వంలో న్యాక్‌ను ఆహ్వానించారు. ప్రతినిధులు పరిశీలించి మొదటిసారిగా బి ప్లస్ గ్రేడ్‌ను ప్రకటించారు. 2009లో వీసీ ఆచార్య గోపాల్‌రెడ్డి నేతృత్వంలో ఏ గ్రేడ్‌ను పొందింది. 2017లో ఆచార్య




ఆర్.సాయన్న ఉపకులపతి ఉన్న సమయంలో ఏ ప్లస్ వరకు వెళ్లి కొన్ని పాయింట్లు తక్కువ రావడంతో ఏ గ్రేడ్‌తోనే సరిపుచ్చుకుంది. 14 ఏళ్ల అనంతరం 2023లో ఉప కులపతి ఆచార్య తాటికొండ రమేష్ నేతృత్వంలో ఏ ప్లస్ గ్రేడ్ వచ్చింది.

**405 కళాశాలలు.. 78 కోర్సులు..**

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌లోని 12 జిల్లాల్లో పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, న్యాయశాస్త్ర కోర్సులతో పాటు పలు వృత్తివిద్యా కోర్సుల్లో విద్యను అందిస్తోంది. 405 వృత్తి విద్య, డిగ్రీ, పీజీ కళాశాలలు ఉన్నాయి. 78 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అన్ని కోర్సుల్లో కలిపి మూడు లక్షలకు మందికి పైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారు.

**ప్రతికూల పరిస్థితుల్లో...**

కాకతీయ విశ్వవిద్యాలయం ప్రస్తుతం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటుంది. 1500 మంది రెగ్యులర్ అధ్యాపకులు అవసరం. ప్రస్తుతం 91 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. తాత్కాలిక, ఒప్పంద, అతిథి అధ్యాపకులతో బోధించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పరిశోధన కుంటుపడుతోంది. ఒక్కొక్క అధ్యాపకుడికి అదనపు పరిపాలన పదవులు అప్పగించారు. ఈ ప్రభావం బోధనపై పడుతోంది.

ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఉద్యోగుల వేతనాలకే ఏడాది రూ.150 కోట్లు కావాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.117 కోట్లు మాత్రమే వస్తున్నాయి. ఆర్థిక పరిస్థితి దిగజారిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉపకులపతి ఆచార్య రమేష్ అన్ని వర్గాలను ఏకం చేసి నిధులను సమీకరించారు. కేయూలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అధ్యాపకుల కొరతను తీర్చడానికి ఉద్యోగ విరమణ పొందిన వారిని నియమించారు. వర్సిటీకి ఏ ప్లస్ గ్రేడ్ రావాడానికి నిర్విరామంగా కృషి చేశారు.

**ఏడాది నుంచి....**

2009లో ఏ గ్రేడు వచ్చింది. దీనిని మెరుగు పరుచుకోవడం కోసం 2022 ఫిబ్రవరి నుంచి సన్నాహాలు ప్రారంభించారు. ఇంటర్నల్, క్వాలిటీ, అస్యూరెన్స్‌సెల్ ద్వారా గ్రేడ్‌ను మెరుగు పరుచుకోవడానికి ఎలాంటి చర్యలు అవసరమో తెలుసుకొని ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఏడాది పాటు సదస్సులు, సింపోజియాలు, శిబిరాలు నిర్వహించారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో మాజీ ఉప కులపతులు, న్యాక్ విషయ నిపుణులు, విశ్రాంత ఆచార్యుల సలహాలు తీసుకున్నారు. పలుమార్లు మాక్ షోలు నిర్వహించారు. అన్ని విభాగాల అధిపతులతో సమావేశాలు నిర్వహించారు. ఐక్యూ ఏసీ, అన్ని విభాగాల విశ్రాంత ఆచార్యులు, కేయూ ఉపకులపతి రమేష్, రిజిస్ట్రర్ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో న్యాక్‌కు కావాల్సిన అన్ని అంశాలపై సమీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది మే 25,26,27 తేదీల్లో న్యాక్ బృందం కేయూను సందర్శించింది. ఈ సమయంలో అన్ని విభాగాల అధిపతులు తమ విభాగాల్లో జరుగుతున్న ప్రగతిని చక్కగా వివరించడంతో ఈ ర్యాంకు సాధ్యమైంది.ఇవి ప్రయోజనాలు.. దూర విద్య కేంద్రంలో డీఈబీ(డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) అనుమతి లేకున్నా ఎలాంటి కోర్సులనైనా ప్రవేశపెట్టుకోవచ్చు..

యూజీసీ, రూసా, కేంద్ర పరిశోధన సంస్థల నుంచి అధిక మొత్తంలో నిధులు వస్తాయి. మేజర్ పరిశోధన ప్రాజెక్టుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

జాతీయస్థాయిలో ఎన్‌ఐఆర్‌ఎఫ్ విశ్వవిద్యాలయాలకు ర్యాంకులు ప్రకటించడంలో ఏ ప్లస్ గ్రేడును పరిగణనలోకి తీసుకుంటారు.

పరిశోధనల కోసం ప్రత్యేకంగా నిధులు ఇస్తారు.

విదేశీ విద్యలో, ప్రాంగణ నియామకాల్లో ప్రాధాన్యం ఉంటుంది.

**పరిశోదన రంగానికి ఊతం....**

**–ఆచార్య తాటికొండ రమేష్, కేయూ ఉపకులపతి**

ఏప్లస్ గ్రేడు దక్కడం సంతోషంగా ఉంది. పరిశోధన రంగం పరుగులు పెడుతుంది. ప్రత్యేక నిధులు వస్తాయి. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధన సంస్థల నుంచి మేజర్ ప్రాజెక్టులు సాధించవచ్చు. విదేశాల్లో పరిశోధనలు చేయాలనుకునే వారికి ప్రోత్సాహంగా ఉంటుంది. పరిశోధన రంగాలను మరింత ముందుకు తీసుకుపోవడానికి ఈ గ్రేడు ఊతం ఇస్తుంది. ఈ స్ఫూర్తితో కేయూను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాం.

**సమష్టి కృషితోనే సాధ్యమైంది– ఎస్‌ఎన్.చారి, ఐక్యూ ఏసీ డైరెక్టర్**

ఈ గ్రేడ్ సాధించడంలో అందరి కృషి ఉంది. ప్రస్తుతం విధులు నిర్వహస్తున్న ఆచార్యులతో పాటు విశ్రాంత ఆచార్యులు, మాజీ ఉపకులపతుల సూచనలు సలహాలు తీసుకున్నాం. ఏడాది పాటు సదస్సులు నిర్వహించాం. పీపీటీ ద్వారా కేయూలో సాధిస్తున్న విద్యాప్రమాణాలు, అందిస్తున్న కోర్సులు, సాధిస్తున్న ఫలితాలను న్యాక్ బృందానికి వివరించాం. పరిమితమైన వనరులతోనే నిరంతర కృషితో ర్యాంకు సాధించాం. ఇందులో అందరి సహకారం ఉంది. కేయూ ప్రతిష్ఠ మరింత పెరుగుతుంది.

# పడకేసిన కూడళ్ల అభివృద్ధి



నర్సంపేట : నర్సంపేటలో ప్రధాన కూడళ్ల అభివృద్ధి పనులు ఐదేళ్లుగా పడకేశాయి. నిధులున్నా పనులు సాగక పట్టణ సుందరీకరణ జాడ కరవైంది. జిల్లాలో విద్య, వైద్య, వ్యాపార, స్థిరాస్తి రంగాల్లో దూసుకుపోతున్న నర్సంపేట పట్టణ సుందరీకరణకు టీయూఎఫ్‌ఐడీసీలో ప్రభుత్వం మొదటి విడతగా 2018 సెప్టెంబరులో రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధుల్లో రూ.55 లక్షలను పట్టణంలో ఐదు ప్రధాన కూడళ్ల అభివృద్ధితోపాటు ఐలాండ్స్ నిర్మాణ పనులకు కేటాయించారు. ప్రధాన కూడళ్ల అభివృద్ధికి 2020 మార్చిలో పనులకు శ్రీకారం చుట్టారు. వరంగల్ రోడ్డు (అమరవీరుల స్తూపం) కూడలిలో సర్కిల్‌గా బండరాళ్లు ఏర్పాట్లు చేసి కొవిడ్ లాక్‌డౌన్‌తో అడుగు ముందుకు పడలేదు.

**ఆరు నుంచి రెండుకు చేరిన కూడళ్లు**

పట్టణంలో మొదట వరంగల్ రోడ్డు(అమరవీరుల స్తూపం), అంగడి, అంబేద్కర్, జయలక్ష్మి(పాకాల), మార్కెట్ బైపాస్ రోడ్డు, ద్వారకపేట రోడ్డు కూడళ్లను అభివృద్ధి చేసి ఐలాండ్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి నమూనాలతో నివేదించగా ఉన్నతాధికారులు ఆమోద ముద్ర వేశారు. తరువాత వాటిలో నుంచి అంగడి కూడలిని తొలగించి ఐదు కూడళ్ల సుందరీకరణకు అధికారులు కసరత్తు చేశారు. ఈ పనులను 2020 మార్చి మూడో వారంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి భూమి పూజ చేసినా పనులు నిలిచిపోయాయి. నిధులు మంజూరై ఐదేళ్లు కావడం అన్నింటి ధరలు పెరగడం పట్టణ భౌతిక స్థితిగతుల్లో చాలా మార్పులు చోటు చేసుకున్నందున గతంలో నిర్ణయించినట్టు మామూలుగా కాకుండా విశాలంగా విస్తరిస్తున్న పట్టణానికి అనుగుణంగా కూడళ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించి రూ.55 లక్షలు రెండు కూడళ్ల పురోగతికి సరిపోతున్నందున అమరవీరుల స్తూపం(వరంగల్ రోడ్డు), పాకాల(జయలక్ష్మి) కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దేందుకు నిశ్చయించారు. ఇలా ఆరు కూడళ్లు ప్రస్తుతం రెండింటికే పరిమితమయ్యాయి.

**ప్రారంభించి వదిలేశారు**

నిధుల మేరకు అమరవీరుల స్తూపం, పాకాల కూడళ్లను విశాలంగా అందరినీ ఆకట్టుకునేలా సుందరంగా అభివృద్ధిపర్చాలని నిర్ణయించి అధికారులు టెండర్లు పిలవగా అనురాగ్ కన్‌స్ట్రక్షన్ పనులు పొందింది. గత జిల్లా కలెక్టర్ గోపి చొరవతో హైదరాబాద్‌కు చెందిన ఓ ఏజెన్సీకి పనులు అప్పగించగా ఏప్రిల్‌లో పాకాల కూడలి అభివృద్ధి పనులు చేపట్టి సర్కిల్‌ను నిర్మించి ఐరన్ పైపులు ఏర్పాటు చేశారు. ఇక కూడళ్ల అభివృద్ధి పనులు సాగుతాయని ఆశించగా ఏమైందోగాని మూడున్నర నెలలుగా నిలిచిపోవడంతో కూడళ్ల అభివృద్ధి పనులు ఎప్పటికి పూర్తవుతాయో ఏమోనని స్థానికులు పెదవి విరుస్తున్నారు.

**ఆకట్టుకునేలా..**

వరంగల్ రోడ్డు(అమరవీరుల స్తూపం) కూడలిలో సుందరీకరణకు చుట్టుపక్కల డబ్బాలను, రోడ్డు పక్క పండ్ల, కొట్లను తొలగించి రోడ్డును విస్తరించారు. అందరినీ ఆకర్షించేలా చుట్టూ 20 అడుగుల వైశాల్యంతో రోడ్లను విస్తరించి మధ్యలో ఐలాండ్, ఫౌంటేన్ మధ్యలో కాకతీయుల కళాతోరణం దాని చుట్టూ పచ్చదనం వెల్లివిరిసేలా పూల మొక్కలు, పచ్చని గడ్డి(గ్రాస్), నీడనిచ్చే చెట్లను పెంచుతారు. ఆర్ అండ్ బీ అతిథి గృహం రెండో ద్వారం నుంచి నెక్కొండ వెళ్లే మార్గం మూల మలుపు వరకు పెద్ద గోడను నిర్మించి ఐ లవ్ నర్సంపేట అక్షరాలను తీర్చిదిద్ది అక్కడ పచ్చదనం ఉండేలా నిర్ణయించినట్లు అధికారులు చెప్పారు.

**మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తాం– శాంతిస్వరూప్, ఏఈ, నర్సంపేట**

ప్రధాన కూడళ్ల అభివృద్ధి పనులు రానున్న మూడు నెలల్లో పూర్తి చేస్తాం. ఇప్పటికే పాకాల కూడలిలో కొంత పని జరిగింది. అమరవీరుల స్తూపం కూడలిలో త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

# సార్వత్రిక విద్యకు వేళాయే..!



వరంగల్ : వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన వారు తిరిగి చదువుకునేందుకు.. ఉద్యోగం ఉన్నప్పటికీ పదోన్నతి పొందలేని వారికి.. వయసుతో సంబంధం లేకుండా విద్యను కొనసాగించాలనుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం సార్వత్రిక విద్య(ఓపెన్ స్కూల్)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పనితో పాటు చదువును ఒకేసారి కొనసాగించే అవకాశం ఉండటంతో క్రమంగా ఓపెన్ స్కూల్స్‌లో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. ఈనెల 10వ తేదీ నుంచి ఆగస్టు 10 వరకు ఆన్‌లైన్‌లో ప్రవేశాలు పొందవచ్చు.

అర్హులు ఎవరంటే?14 ఏళ్లు నిండి బడి మధ్యలో మానేసిన వారు ఓపెన్ స్కూల్‌లో చేరి పదో తరగతి చదివేందుకు అవకాశం ఉంది. 15 ఏళ్లు నిండి పదో తరగతి పూర్తిచేసిన వారు ఇంటర్‌లో చేరవచ్చు. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత డిగ్రీ, పీజీ తదితర కోర్సులు చేసేందుకు వీలుంది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆసక్తి గల వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు.

**విద్యా బోధన విధానం..**

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మొత్తం 105 వరకు అధ్యయన కేంద్రాలున్నాయి. సెలవు దినాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ, ఓపెన్ స్కూల్ వారిచే రూపొందించిన స్వయం అధ్యయన పుస్తకాలు అందిస్తారు. ఏటా మార్చి, ఏప్రిల్, అక్టోబరు నెలల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులే సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు. దూరవిద్యా విధానంలో ప్రవేశాలు పొందిన వారికి కేంద్రంలో పాఠాలు బోధిస్తారు. మొత్తం 30 తరగతులు ఉండగా అభ్యర్థులు తప్పనిసరిగా 20 తరగతులకు హాజరుకావాలి.

ఫీజు వివరాలు ఇలా..: ప్రవేశ ఫీజు పదో తరగతి ఓసీ కేటగిరీకి రూ.వెయ్యి, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.600. ప్రాస్పెక్టస్ ఖరీదు రూ.100, ఆన్‌లైన్ ఛార్జీలు అదనం.. అపరాధ రుసుం రూ.100తో ఆగస్టు 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్మీడియట్ ప్రవేశ ఫీజు ఓసీలకు రూ.1100, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.800, ప్రాస్పెక్టస్ ఖరీదు రూ.200, అపరాధ రుసుం రూ.200 చెల్లించాల్సి ఉంది. ప్రవేశ ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి, రసీదు, అడ్మిషన్ ఫారం ప్రింట్‌తో కలిపి అధ్యయన కేంద్రంలో సమర్పించాలి.

**సద్వినియోగం చేసుకోవాలి– ఎం.శంకర్‌రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయకర్త**

దూరవిద్య చదవాలనుకునే వారికి పది, ఇంటర్‌లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. సార్వత్రిక విద్యా విధానంలో చదివి ఉపాధి అవకాశాలు పెంచుకోవచ్చు. ముఖ్యంగా ఇంటి దగ్గరే ఉండి చదువుకోవడానికి ఇది చక్కటి అవకాశం. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలి.

# నగరంలో డెంగీ!

వరంగల్ : నగరంలో డెంగీ, మలేరియా జ్వరాలు పెరుగుతున్నాయి. మూడు, నాలుగు వారాల్లోనే బాధితుల సంఖ్య పెరిగింది. 16 డెంగీ, 3 మలేరియా కేసులు బయటపడ్డాయి. కడిపికొండ రాజీవ్ గృహకల్ప కాలనీలో ఏడాది బాబుకు మలేరియా సోకింది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని తెలిసింది. దీంతో గ్రేటర్ వరంగల్ అర్బన్ మలేరియా విభాగం అప్రమత్తమైంది. డెంగీ, మలేరియా కేసులు వచ్చిన కాలనీల్లో దోమల నివారణ చర్యలు ముమ్మరం చేశారు. కడిపికొండ రాజీవ్ గృహకల్ప కాలనీలో సుమారు 350 కుటుంబాలు నివాసముంటాయి. చిన్న పిల్లాడికి మలేరియా సోకడంతో ప్రత్యేక పారిశుద్ధ్యం పనులు, దోమల నివారణ పనులు చేపట్టారు. వర్షాలు ఎక్కువైతే జ్వరాలు పెరుగుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సీజనల్ వ్యాధుల ప్రారంభ దశలోనే డెంగీ, మలేరియా కేసులు రావడంతో ప్రజారోగ్యం, అర్బన్ మలేరియా విభాగాలు ప్రత్యేక పారిశుద్ధ్య పనులకు కార్యాచరణ ఖరారు చేయాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు.పేదల బస్తీల్లో అవగాహన: కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లో 183 మురికివాడలు ఉన్నాయి. సుమారు 2.25 లక్షల జనాభా ఉన్నారు. పేదల బస్తీల్లో డెంగీ, మలేరియా, విషజ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు అర్బన్ మలేరియా విభాగం దృష్టి సారించింది. పేదల బస్తీల్లో దోమల నివారణకు ప్రణాళిక రచించారు. గురువారం ఓఎస్‌నగర్, రఘునాథ్ కాలనీ, పాపయ్యపేట, ఎన్టీఆర్‌నగర్‌లో పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికెళ్లి పరిశీలించారు. ఖాళీ డ్రమ్ములు, పాత ఇనుప సామగ్రి, టైర్లు, వాటర్ కూలర్లు, పాత కుండలు, పూల కుండీల్లో నిల్వ ఉన్న నీళ్లను తొలగించారు. కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో ఎంఎల్వో ఆయిల్, టిమోపాస్ పిచికారీ చేశారు. మురుగు కాల్వల్లో చెత్త చెదారం తీసివేశారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు వివరించారు.

# అధిక దిగుబడికి నాలుగు పద్ధతులు!

వరంగల్ : వానాకాలం సాగుకు సంబంధించి రైతులు మంచి దిగుబడి సాధించేందుకు వ్యవసాయశాఖ నాలుగు విధానాలు మేలన్న నినాదంతో ముందుకు వెళ్లనుంది. అన్నదాతలు నాలుగు విధానాలు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని దీంతో భూసార పరిరక్షణతో పాటు పలు ప్రయోజనాలు ఉంటాయని ప్రచారం చేస్తోంది. క్షేత్ర సందర్శనలో.. ప్రయోజనం పొందుతున్న రైతుల అభిప్రాయాలను ఇతర రైతులకు చెప్పించి బహుళ ప్రచారం చేయాలని సంకల్పించింది. నాలుగు విధానాల వివరాలివి..

**వెదజల్లే పద్ధతి**

వరి సాగు విషయంలో నారుమడులు తయారు చేయడం, నారు పెంచడం, నాట్లు, కలుపుమొక్కల తొలగింపు తదితర పనులకు కూలీలు అధికంగా కావాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో వీరి కూలీల కొరత ఎక్కువగా ఉంది. దీంతో వీరికి కూలీ చెల్లించడం కూడా రైతులకు తలకు మించిన భారంగా మారుతోంది. దీన్ని నివారించేందుకు రైతులు వెదజల్లే పద్ధతిలో పంటలు సాగు చేయాలని సూచిస్తున్నారు. దీంతో సమయం, డబ్బు మిగులుతాయని, రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని, ప్రతి మొక్క ఎదగడానికి అవకాశం ఉంటుందని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. నిరుడు వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన రైతులతో మాట్లాడిస్తున్నారు.

**భాస్వరం కరిగించే ప్రక్రియ**

రైతులు పొలాల్లో వాడే ఎరువుల్లో మోతాదుకు మించిన భాస్వరం కలిసి ఉంటుంది. దీంతో భాస్వరం నిల్వలు పొలంలో పేరుకుపోయి పంట దిగుబడిపై అధిక ప్రభావం చూపుతుంది. రెండేళ్ల నుంచి పొలాల్లో భాస్వరం కరిగించే గుళికలను ప్రభుత్వం అందించింది. మొదటి ఏడాది ఎంపిక చేసిన రైతులకు ఉచితంగా అందించిన ప్రభుత్వం.. అనంతరం ఉపసంహరించుకుంది. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న గుళికలను వినియోగించుకొని పొలాల్లో పేరుకుపోయిన భాస్వరం నిల్వలను తగ్గించుకోవాలని ప్రచారం చేస్తోంది. రెండు మూడేళ్లుగా ఈ ప్రయోగం చేసిన రైతులతో మాట్లాడించే ప్రయత్నాలు చేస్తోంది. ప్రతి క్లస్టర్‌కు కనీసం 200 ఎకరాల్లో భాస్వరాన్ని కరిగించే ప్రయత్నాలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

**పచ్చిరొట్ట ఎరువు..**

ఏటా వానాకాలం సాగుకు ముందే ప్రభుత్వం పచ్చిరొట్ట ఎరువును తగ్గింపు ధరలకు అందిస్తుంది. మునుపటిలా పెంటమట్టి అందించకపోవడం, గొర్రెల మందలను పెట్టించకపోవడంతో పొల్లాలో సారం పెరగడం లేదని, ఉన్నసారాన్ని అధిక మోతాదులో ఎరువులు వాడి పొలాలను నిర్వీర్యం చేస్తున్నారని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. దీనికి విరుగుడుగా జీలుగ, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించిన మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యమిస్తున్న వ్యవసాయశాఖ తాజాగా.. పచ్చిరొట్ట పెంపకం చేపట్టిన రైతుల క్షేత్ర సందర్శనలకు ఏర్పాట్లు చేస్తోంది. వ్యవసాయ విస్తరణాధికారులు పచ్చిరొట్ట ఎరువుల క్షేత్రాలకు సమీపంలోని రైతులను తీసుకెళ్లి చూపిస్తున్నారు.

**ఎరువుల వాడకం..**

పనిభారాన్ని తగ్గించుకునేందుకు రైతులు ఒకేసారి ఎరువులను వెదజల్లుతుంటారు. ఇది సమర్థనీయమైన విధానం కాదని నిపుణులు సూచిస్తుండడంతో వ్యవసాయాధికారులు రైతులను చైతన్యపర్చాలని నిర్ణయించారు. ఎరువులు వాడాల్సి వచ్చినప్పుడు ఒకేసారి కాకుండా మూడు విడతల్లో వినియోగించాలని సూచిస్తున్నారు. రైతులకు కొద్దిగా భారమే అయినా ఎరువులోని ప్రతి గుళికా పూర్తిస్థాయిలో మొక్కకు చేరుతుందని, వృథా తగ్గుతుందని ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. ఈ విధానాన్ని అనుసరించే రైతుల వివరాలను అధికారులు సేకరించనున్నారు.

**వ్యవసాయం భారం కాకూడదనే..– వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి**

రైతులకు కూలీల కొరత సమస్యను తగ్గించి పంట దిగుబడి పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇందులో భాగంగానే ఈ నాలుగు విధానాలపై బహుళ ప్రచారం చేస్తున్నాం. జనగామ జిల్లాలోని 64 మంది వ్యవసాయ విస్తరణాధికారులు అనుసంధానించిన క్లస్టర్ గ్రామాలను తరచూ సందర్శించడంతో పాటు పదిమంది రైతులు కూర్చున్న చోట ఈ విషయాలు వివరిస్తున్నారు. వానాకాలంలో జిల్లాలో 1,90,000 ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేశాం.

# వరుణుడిపైనే భారం

గరిడేపల్లి : ఇంతకాలం వేచి చూసిన అన్నదాత అదను దాటి పోతుండటంతో వరుణుడి భారం వేసి, నేల తల్లిని నమ్ముకుని విత్తనాలు చల్లుతున్నారు. జూన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేక ఏ పనులు సాగలేదు. కనీసం జులైలోనైనా వరుణుని కటాక్షం కోసం ఎదురుచూసిన అన్నదాతకు వాన చుట్టపు చూపుగా వచ్చినట్లు వచ్చి పోతోంది. ఇక అదను దాటి పోతుందనే బాధతో విత్తనాలు చల్లుకోవడం మొదలు పెట్టారు. చాలామంది రైతులు బోర్లు, బావుల కింద నారుమడి దుక్కి తడిపి విత్తనాలు చల్లుతున్నారు నీటి సౌలభ్యం, వనరులు పుష్కలంగా ఉన్న రైతులు సాగు పనులు ప్రారంభించారు. ఇప్పటికే 5 శాతం మంది దుక్కులు తడిపి దమ్ములు ప్రారంభించారు. ఎక్కువగా వెదజల్లే పద్ధతి, డ్రమ్‌సీడర్ విధానం అవలంబించే వారంతా ఈ నెల మొదటి పక్షంలోగా పనులు పూర్తిచేయాలనే సంకల్పంతో ఉన్నారు. అపుడే ఆశించిన దిగుబడి సాధించడంతో పాటు తెగుళ్ల నుంచి ఉపశమనం ఉంటుంది.

వానలు అంతంతే ఆయకట్టులో అన్నదాతలు ఈ ఏడాది కరవు పరిస్థితులు కన్పిస్తున్నాయనే అభిప్రాయానికి వచ్చారు. నేటికీ ఎండల తీవ్రతతో ఒట్టిగాలి వీస్తుండటమే ఇందుకు కారణం. ఇలా గాలి వీస్తే ఎండల కంటే ప్రమాదమని చెబుతున్నారు. బోర్లు, బావుల్లో నీటి నిల్వలు తగ్గుతాయని, ఆవిరి ఎక్కువగా ఉంటోందని పేర్కొంటున్నారు. నైరుతి రుతు పవనాలతో ఆశించిన స్థాయిలో వానలు కురలేదు. జులైలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినా ఆయకట్టులో మాత్రం నామమాత్రంగానే వానలు పడ్డాయి. వరుణుడు కరుణించి పెద్ద వర్షం పడితే నార్లు పోయవచ్చని ఇంతకాలం రైతులు ఎదురుచూశారు. వర్షానికి తోడు విద్యుత్ మోటర్ల సాయంతో దుక్కులు త్వరగా తడుపుకోవచ్చని ఆశపడ్డారు. ఇంతవరకు దుక్కులు తడిసే వర్షం పడకపోవడంతో వారి ఆశలు అడియాశలవుతున్నాయి. పడిన కొద్దిపాటి వర్షం పొడి దుక్కులు దున్నడానికి పరిమితమైంది. అందుకే ఇంతకాలం రైతులు ఎపుడు గట్టి వాన కురుస్తుందా.. వరి విత్తనాలు చల్లుకుందామా అని ఎదురుచూస్తువచ్చారు. చిరుజల్లులు మబ్బు ఉన్న చోట వాకిలి తడిసే రీతిలో పడిపోవడం తప్ప భూమి 10 సెం.మీ. తడిసే వాన పడటం లేదు.

తప్పక.. ఆగక విత్తనాలు చల్లుకోవడం ఇపుడు తప్పనిసరి. ఆగితే డిసెంబర్‌లో ఇబ్బందులు పడాలి. అలాగని చల్లితే ఆగస్టు 10 లోగా నీరు రాకపోతే నారు ముదిరి పనికిరాకుండా పోతుంది. ఇపుడు అంటే ఈ నెల 10లోగా నార్లు పోసుకుంటే ఆగస్టు 15 లోగా నాట్లు వేసుకోవచ్చు. అంటే నారు 25-35 రోజుల వయసు ఉంటుంది. అంతకంటే ఎక్కువ రోజులు అయితే పంట దిగుబడిలో తగ్గుదల ఉంటుంది. ఎందుకంటే ప్రస్తుతం ఆయకట్టులో స్వల్పకాలిక వరి వంగడాలనే సాగుచేస్తున్నారు. అవి 120-125 రోజుల పంటకాలం. నారు 35 రోజులు ఉంటే మొక్కల పిలక తొడిగి ఎదుగుదల చెందే సమయం దాదాపు నెల ఉంటుంది. సగం సమయం పిలక దశకే సరిపోతుంది. దుబ్బు బలంగా పెరిగి పొట్ట దశకు వచ్చి బలమైన కంకి వేయాలంటే కనీసం 45-50 రోజులు పోషకాలు అందించడం అవసరం. గింజ పోసుకునే 15 రోజులు కీలకమే. బరువుతోపాటు గింజలన్నీ వడ్లుగా మారతాయి.

# వానమ్మా.. వచ్చిపోవమ్మా!

ఖమ్మం: జిల్లావ్యాప్తంగా కరవు పరిస్థితులు నెలకొంటున్నాయి. ఖరీఫ్ సీజన్ ఆరంభమై 40 రోజులు అవుతున్నా గట్టి వాన కురిసిన జాడ లేదు. జల వనరుల్లోకి వరద ప్రవాహం కొనసాగిన ఆనవాళ్లు లేవు. వరుణుడి కరుణ కోసం జిల్లా వాసులు ఆకాశం వైపు చూస్తున్నారు. జూన్ నెల పూర్తిగా.. జులైలో ఇప్పటి వరకు జిల్లాలో ఎక్కడా చెప్పుకో దగిన స్థాయిలో వర్షం కురవలేదు. దీంతో చెరువులు అడుగంటుతు న్నాయి. వర్షాభావ పరిస్థితులతో రోజురోజుకు నీటి మట్టం పడిపోతోంది. మండే ఎండలకు ఉన్న నీరు ఆవిరవుతోంది.జిల్లాలో 983 చెరువులు ఉన్నాయి. వాటిలో 771 తటాకాల్లో నీటిమట్టం 25



శాతం కంటే తక్కువగా ఉంది. మిగతావాటిలో కొంత నీరున్నా.. వర్షాలు కురవక వేగంగా మట్టం పడిపోతోంది. గత ఏప్రిల్‌లో సాగర్ కాలువ బంద్ చేసే ముందు చాలా చెరువులను నిండుగా నింపారు. దీంతో ఇప్పటిదాకా కొన్నింటిలో కాస్తైనా జలకళ ఉంది. లేకుంటే అవీ పూర్తిగా ఎండిపోయేవే. వేసవిలో చేపలు పట్టేందుకు చాలా చెరువుల్లో నీరు వృథాగా వదిలేయగా అవి ఖాళీ అయ్యాయి. వర్షాభావ పరిస్థితులు మరికొన్ని రోజులు కొనసాగితే గ్రామాల్లో పశువులకు తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం పొంచిఉంది. చెరువులు పూర్తిగా ఎండిపోతే పశువులు, గొర్రెలు, మేకలు సహా ఇతర జంతువులకు దాహార్తి తీర్చుకునే దారి ఉండదు. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ఇప్పటి వరకు దృష్టి సారించనే లేదు.

# ఆబ్కారీ శాఖ బదిలీల్లో.. రాజకీయ పైరవీలు?




ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆబ్కారీ శాఖలో బదిలీలు, పదోన్నతుల పోస్టింగుల (ఎస్సైలకు సీఐగా) ప్రక్రియ సైతం రాజకీయ పైరవీలకు కేంద్రంగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలువురు అధికారులు బదిలీల్లో నచ్చిన స్థానం కోసం కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటం గమనార్హం. పోలీసు ఎస్సై, సీఐల మాదిరిగా ఆబ్కారీలోనూ సిఫారసు లేఖలు ఇస్తుండటం తాజాగా చర్చనీయాంశమైంది. ఇందుకోసం ముడుపులు సైతం చేతులు మారుతున్నట్లు ఆ శాఖలో చర్చ జరుగుతోంది.

ఖమ్మంలో 7, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 6 ఆబ్కారీ పోలీస్ స్టేషన్లు కొనసాగుతున్నాయి. ఆయా స్టేషన్ల పరిధిలో దాదాపు 210 మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఏటా మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.3 వేల కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ శాఖలో ఎస్సైలు, సీఐలు, ఆ పైస్థాయి అధికారులకు మూడేళ్లకోసారి శాఖాపరమైన బదిలీలు జరుగుతుంటాయి. ఈ ప్రక్రియకు నేర నియంత్రణ, మద్యం అమ్మకాల ద్వారా సమకూరిన ఆదాయం, ఇతర అంశాలను ప్రాతిపదికగా తీసుకునేవారు. కానీ ప్రభుత్వం గత ఆరేళ్లుగా సాధారణ బదిలీలు చేపట్టలేదు. చివరి సారిగా ఉమ్మడి జిల్లాలో 2017లో ఈ ప్రక్రియ జరిగింది. ఆ తర్వాత అడపాదడపా శాఖాపరమైన మార్పుల్లో భాగంగా అతికొద్ది బదిలీలు, పదోన్నతుల పోస్టింగులు మాత్రమే కల్పించారు.

ఎక్కడ చూసినా అదే చర్చ.. రచ్చ

ఆరేళ్ల వ్యవధి తర్వాత ఉభయ జిల్లాల్లో నెల రోజులుగా బదిలీలు, పోస్టింగుల వ్యవహారం జోరందుకుంది. ఈ ప్రక్రియలో మితిమీరిన రాజకీయ జోక్యం, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారాయి. సుమారు పది స్టేషన్ల పరిధిలో ఈ విషయమై చిచ్చు రగులుతోంది. నచ్చిన స్థానాల్లో పోస్టింగుల కోసం అధికారుల తరఫున ఏకంగా స్థానిక ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారు. వారు సిఫారసు లేఖలు ఇస్తుండటంతో కొందరు అధికారులు బారులుదీరుతున్నారు. ఒకరిని మించి మరొకరు నచ్చిన చోట పోస్టింగు దక్కించుకునేందుకు సర్వశక్తులొడ్డుతున్నారు. ఒకరిద్దరు తాము అనుకున్న పోస్టుకు వెళ్లడంతో.. మిగతావారూ గత మూడు వారాలుగా అదే ప్రయత్నాల్లో మునిగితేలుతున్నారు. ఫలితంగా ఏ స్థానంలోకి ఎవరు వస్తారోనన్న ఉత్కంఠ ఆబ్కారీ స్టేషన్లలో నెలకొంది. ఉన్నతాధికారుల ఆశీస్సులు, రాజకీయ పలుకుబడితో కొందరు తమ స్థానాన్ని పదిలం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అవసరమైతే సామాజిక సమీకరణాలను తెరపైకి తెచ్చి లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం. అనుకున్న పని జరిగేందుకు రూ.లక్షల్లో ముడుపులు కట్టబెట్టేందుకు వెనుకాడటం లేదన్న చర్చ జరుగుతోంది. ఈ ప్రయత్నాలతో కొందరు అసలు విధులనే పక్కనబెట్టారన్న చర్చ జరుగుతోంది.

ఆబ్కారీ బదిలీల్లో రాజకీయ పైరవీల పాత్రపై ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డిని 'ఈనాడు' వివరణ కోరగా అంతా శాఖ నిబంధనల ప్రకారం పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఒత్తిళ్లు, రాజకీయ సిఫార్సులకు తావే లేదని ఆరోపణలు కొట్టిపారేశారు. ఇటీవల ఖమ్మం జిల్లాలోని రెండు ఆబ్కారీ స్టేషన్లలో పరస్పర బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. మళ్లీ అదేరోజు వాటి ఉపసంహరణ ఉత్తర్వులూ వెలువడటం గమనార్హం. అప్రాధాన్య పోస్టులు దక్కిన కొందరు సీఐలు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం, ఇది ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం బదిలీల నిలిపివేతకు కారణమైంది.

ఇటీవల భద్రాద్రి జిల్లాలో ఓ అధికారిని టాస్క్‌ఫోర్స్ సీఐగా బదిలీ చేయగా ఆయన అక్కడ చేరలేదు. రాజకీయ పలుకుబడితో వారంలోపే అదే జిల్లాలో ప్రాధాన్యం గల మరో పోస్టు తెచ్చుకున్నారు.

# రాచమార్గాలు.. విస్తరణకు అడుగులు

మహబూబాబాద్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో రవాణా వ్యవస్థను మెరుగుపరిచేలా జాతీయ రహదారుల విస్తరణ పనులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు రూ.5,588 కోట్లు కేటాయించింది. జగిత్యాల-ఖమ్మం కారిడార్‌లోని కరీంనగర్- వరంగల్ 563వ జాతీయ రహదారి, నాగ్‌పూర్-విజయవాడ కారిడార్ మధ్య మంచిర్యాల-హనుమకొండ వరకు గ్రీన్‌ఫీల్డ్ 163జీ రహదారి విస్తరించనుంది. ఈ పనులకు స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. రహదారుల విస్తరణతో అభివృద్ధి పరుగులు పెట్టనుంది. ఇండస్ట్రియల్ కారిడార్ మెరుగుపడుతుంది. వాహనదారులకు సమయం ఆదా అవుతుంది. వ్యయభారమూ తగ్గుతుంది. 2025-26 నాటికి పూర్తి చేసేలా గడువు విధించారు. అనుకున్నట్లుగా పనులు సమయానికి పూర్తి చేస్తే అంతర్రాష్ట్ర కనెక్టివిటీ మెరుగుపడుతుంది. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి జగిత్యాల నుంచి ఖమ్మం వరకు విస్తరించి ఉంది. రెండు వరుసలతో 244.1 కి.మీ. దూరమున్న ఈ రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. తొలుత కరీంనగర్-వరంగల్ సెక్షన్ల మధ్య మానకొండూరు బైపాస్ నుంచి హసన్‌పర్తి మండలం పలివేల్పుల వరకు 68 కి.మీ. మేర విస్తరించేందుకు నిధులు కేటాయించారు. భూసేకరణ ప్రక్రియను చేపట్టి 60 శాతానికిపైగా పూర్తి చేశారు. భూ నిర్వాసితులకు పరిహారం అందిస్తారు. రహదారి విస్తరణలో 45 కి.మీ. మేర బాహ్యవలయ రహదారి ఏర్పాటు కానుంది. ఈ మార్గం 45 నుంచి 60 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తుండగా రెండు జిల్లాల పరిధిలోని 30 గ్రామాలకు మేలు జరగనుంది. వాహనదారులు విశ్రాంతి తీసుకునేందుకు, రోడ్డు పక్కన వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు.

ప్రస్తుతం విస్తరణ చేయనుంది : 68 కిలోమీటర్లు

కేటాయించిన నిధులు: రూ.2,147 కోట్లు

బైపాస్‌ల నిర్మాణం: 5 (మానకొండూర్, తాడికల్, హుజూరాబాద్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి పరిధిలో) ప్రధాన వంతెనలు: 9, చిన్నవి: 20, లి పై వంతెనలు (ఆర్వోబీ): 1, లి వాహనాల అండర్ పాస్‌లు (వీయూపీ): 21, చిన్న వాహనాల అండర్ పాసులు(ఎల్‌వీయూపీ): 6, రోడ్డు అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ): 1, పాదచారుల అండర్‌పాసు: 1ప్రయోజనాలు: ఇండస్ట్రియల్ కారిడార్ మెరుగుపడుతుంది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు సులువుగా వెళ్లొచ్చు. ప్రధాన పట్టణాలకు వెళ్లడానికి బైపాస్‌లు అనుకూలంగా ఉంటాయి. ప్రధానంగా రామప్ప, మేడారం, బొగత జలపాతం లాంటి పర్యాటక ప్రాంతాలకు వెళ్లడానికి వీలుగా ఉంటుంది. స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి.

మూడు రాష్ట్రాలకు అనుసంధానం

మూడు రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులు మొదలయ్యాయి. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లోని మంచిర్యాల-వరంగల్ జిల్లాలను కలుపుతూ నాలుగు వరుసల రహదారి నిర్మాణం ప్రారంభం కానుంది. ప్రధానమంత్రి గతి శక్తి పథకంలో రూ.3,441 కోట్లను కేటాయించారు. 108 కి.మీ. మేర నిర్మించే రహదారిని మూడు విభాగాలుగా విభజించారు. వరంగల్ జిల్లాకు పలు ప్రయోజనాలు కలగనున్నాయి. మంచిర్యాల నుంచి వరంగల్ వరకు 34 కి.మీ. దూరం తగ్గనుంది. జాతీయ రహదారి 45, 65లపై రద్దీ తగ్గడంతో పాటు జిల్లావాసులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

విభాగాల వారీగా: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ నుంచి పెద్దపల్లి జిల్లా మంథని మండలం పుట్టపాక వరకు 31 కి.మీ. పనులు చేస్తారు. నీ పెద్దపల్లి జిల్లా మంథని మండలం పుట్టపాక నుంచి భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పంగిడిపల్లె వరకు 38 కి.మీ. నీ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పంగిడిపల్లె నుంచి హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ వరకు 39 కి.మీటర్ల మేర పనులు చేయనున్నారు.

అంతర్గత మార్పులు: 11 విశ్రాంతి ప్రాంతాలు: 4

ప్రయోజనాలు: మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య అంతర్రాష్ట్ర సంబంధాలు మరింత పెరుగుతాయి. నాగ్‌పూర్- విజయవాడ మధ్య 178 కి.మీ. దూరం తగ్గుతుంది. ప్రధాన రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, ఓడరేవులతో బహుళ మోడల్ కనెక్టివిటీ మెరుగుపడు తుంది.

# కిన్నెరసాని.. లీకేజీల కహానీ

కొత్తగూడెం : జంట పట్టణాలుగా పేర్కొనే కొత్తగూడెం, పాల్వంచ పురపాలకాల ప్రజలను నిత్యం వేధించే సమస్యల్లో 'తాగునీరు' ముందుంటుంది. '24ఐ7 సరఫరా' అంటూ అధికారులు, ప్రజాప్రతినిధుల ఊకదంపుడు ఉపన్యాసాలు ఓవైపు.. 'మంచినీరు మహాప్రభో' అంటూ బాధిత కాలనీల ప్రజల ఘోష మరోవైపు ఇక్కడ షరా మామూలైంది. పైపులైన్ల ద్వారా సరఫరా అవుతున్న కిన్నెరసాని తాగునీటి పథకం శుద్ధిజలాలు భారీ లీకేజీల కారణంగా మధ్యలోనే నేలపాలవుతున్నాయి. రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్న అరకొర తాగునీరు సైతం నిర్వహణ కారణంగా ప్రజలకు సక్రమంగా చేరడం లేదు.

లోపభూయిష్ఠంగా పైపులైన్ వ్యవస్థ

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 22 వేల కుటుంబాలున్నాయి. జనాభా లక్షకు పైగా ఉంది. అధికారుల లెక్కల ప్రకారం సుమారు 9,800కి పైగా నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ప్రజల అవసరాలు తీరేందుకు రోజుకు 9.5 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ ఫర్ డే) నీరు సరఫరా చేయాల్సి ఉంది. కానీ రోజు విడిచి రోజు సరఫరా చేయడంతో కేవలం 6 నుంచి 7 ఎంఎల్‌డీలు మాత్రమే అందుతున్నాయి. ఇందులోనూ లీకేజీల ద్వారా పెద్ద ఎత్తున శుద్ధి జలాలు వృథాగా పోతున్నాయి. లీకేజీలను అరికట్టడంలో అధికారులు, సిబ్బంది విఫలమవుతున్నారు. పాత పైపులైన్ స్థానంలో కొత్తదాన్ని ఏర్పాటు చేయడానికి 2021లో రూ.130 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అది నేటికీ కార్యరూపం దాల్చలేదు. మరోవైపు పాత లైన్ ఎక్కడపడితే అక్కడ మరమ్మతులకు గురవుతోంది.

ఎప్పుడూ తిప్పలే..

ఉభయ పట్టణాల్లో 'మిషన్ భగీరథ'లో భాగంగా నిరంతరం నీరు సరఫరా చేస్తామని నాయకులు, అధికారులు చెప్పినా అది పైపులైన్ పనుల నిర్మాణ దశకే పరిమితమైంది. కేవలం 50 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంటింటికీ నల్లా కనెక్షన్ ప్రక్రియ పూర్తికాలేదు. రోజు



విడిచి రోజు సరఫరా చేస్తామని చెప్పినా.. ప్రస్తుతం వారానికి ఒకట్రెండు రోజులు మాత్రమే అందిస్తున్నారు. వర్షాకాలంలో జంట పట్టణాల్లో లీకుల కారణంగా కలుషిత జలాలు సరఫరా అయ్యే అవకాశం ఉంది. అది తాగేందుకు పనికిరాదు. పైగా నీటి జనిత వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచిఉంది. ఈ నేపథ్యంలో తాగునీటి పరంగా పురవాసులకు మరిన్ని గడ్డు పరిస్థితులు ఎదురుకానున్నాయి. సిబ్బంది సకాలంలో స్పందించి లీకేజీలకు మరమ్మతులు చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు వేడుకుంటున్నారు.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఏర్పడే పైప్‌లైన్ లీకేజీలపై మున్సిపల్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడ లీకేజీ ఏర్పడితే అక్కడ తక్షణమే మరమ్మతులు చేస్తున్నాం. సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.జి.రఘు, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం

# పంట ఉత్పత్తుల నిల్వకు భరోసా



ఖమ్మం: రైతులు పండించిన పంట ఉత్పత్తుల నిల్వకు ప్రతి మండలంలో ఒక గోదాము అవసరమని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. తాజా నిర్ణయంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కొన్నిచోట్ల కొత్తగా గోదాములు ఏర్పాటయ్యే అవకాశముంది. ఏటా సాగు విస్తీర్ణంతో పాటు దిగుబడులు గణనీయంగా పెరుగుతుండటంతో గోదాములకు డిమాండ్ ఏర్పడింది.

ఉభయ జిల్లాల్లో..

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుత గోదాముల సామర్థ్యం 1.66 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. అందుకే రైతులు పంట ఉత్పత్తులను రోడ్లపై, కల్లాల్లో నిల్వ చేస్తున్నారు. అకాల వర్షాలతో నష్టపోతున్నారు. ధాన్యం, మొక్కజొన్నల దిగుబడులు ఒకే సమయంలో వస్తుండటంతో నిల్వ చేసేందుకు గోదాముల్లో స్థలం సరిపోవటం లేదు. విద్యాసంస్థలు, జిన్నింగ్ మిల్లులతో పాటు పొరుగు జిల్లాలకు తరలిస్తున్నారు.

మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించనప్పుడు రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు యత్నిస్తారు. కొందరు స్థలాభావం వల్ల తక్కువ ధరకే దిగుబడులను విక్రయించి నష్టపోతుంటారు. ప్రతి మండలంలో 10వేల నుంచి 15వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు ఉంటే స్థానిక రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చు.

ఇక్కడ మరిన్ని అవసరం..

ఖమ్మం జిల్లాలో నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని పాలేరు, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో ఎక్కువ ధాన్యం ఉత్పత్తి అవుతోంది. ఆయా ప్రాంతాల్లో గోదాముల సంఖ్య పెంచాలని రైతులు కోరుతున్నారు.

మండలానికో గోదాము నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించటం వల్ల రైతుల కష్టాలు తీరనున్నాయి. కొత్తగా గోదాములు నిర్మిస్తే రైతులు స్థానికంగానే తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం దొరుకుతుంది. మార్కెట్‌లో మంచి ధర ఉన్నప్పుడు విక్రయించుకుంటారు. కె.నాగరాజు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, ఖమ్మం

ఖమ్మం జిల్లాలో... ప్రస్తుత గోదాముల సంఖ్య: 57

నిల్వ సామర్థ్యం: 1,06,770 మెట్రిక్ టన్నులు

గోదాములు లేని మండలాలు: సింగరేణి, కామేపల్లి, తిరుమలాయపాలెం, ముదిగొండ, పెనుబల్లి, కూసుమంచి

# అటు పరిహారం.. ఇటు స్వాహాకార్యం

ఖమ్మం: సింగరేణి ఉపరితల గని(ఓసీ) విస్తరణ కోసం భూములు సేకరించారు. భూనిర్వాసిత పరిహారం కూడా చెల్లించారు. కానీ ఆ భూముల సర్వేనెంబర్లు రికార్డుల నుంచి తొలగించలేదు. దీన్ని కొందరు తమకు అవకాశంగా మలచుకున్నారు. రైతు బంధు నగదు నిరాటంకంగా జమ అవుతుండగా, కొందరు ఇంకొంచెం ముందుకు వెళ్లి పంట రుణాలు పొందడానికి దరఖాస్తులు చేసినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది.

రైతు బంధు యథాతథం..ఆపై రుణ దరఖాస్తులు

సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ విస్తరణ కోసం కొమ్మేపల్లి, రేజర్లలో వ్యవసాయ భూములు సేకరించారు. విజయవాడ డైవర్షన్ రోడ్డులోనూ కొంత సేకరించి ఆయా భూములకు సింగరేణి సంస్థ పరిహారం చెల్లించింది. తమ అవసరాల నిమిత్తం సింగరేణి పరిహారం చెల్లించి భూములను స్వాధీనం చేసుకున్న వెంటనే సదరు సర్వే నంబర్లు, భూ వివరాలు ధరణి పోర్టల్‌తోపాటు సంబంధిత రికార్డుల్లో పూర్తిస్థాయిలో తొలగించాల్సి ఉంది. కానీ ఆయా భూములకు సంబంధించి పలు సర్వే నంబర్లు రికార్డుల్లో, ఆన్‌లైన్‌లో తొలగించకపోవడంతో సదరు వ్యవసాయ భూములకు రైతు బంధు నగదు జమ అవుతోంది. కొందరు అక్రమార్కులు ఇదే అదునుగా భావించి పరిహారం అందుకున్న భూములపైనా పంట, మార్టిగేజ్ రుణాల కోసం బ్యాంకుల్లో దరఖాస్తులు సైతం చేసుకున్నారు. అడ్డదారిలో కొందరు రుణాలు పొందుతున్నారన్న చర్చ కూడా సత్తుపల్లిలో పెద్దఎత్తున జరుగుతోంది.

ఆది నుంచీ అక్రమాలే..

జేవీఆర్ ఓసీ పరిహారాల అంశంపై ఆది నుంచీ ఆరోపణలున్నాయి. కొమ్మేపల్లిలో కొందరు రూ.కోట్లల్లోనే పరిహారాన్ని కాజేశారనే ప్రచారం అప్పట్లో పెద్దఎత్తున జరగ్గా రేజర్లలోనూ సింగరేణి పరిహారంలో అనేక అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపించాయి. 2022 జనవరిలో రేజర్ల భూములకు పరిహారం చెల్లించినా సర్వే నంబర్లు తొలగించకపోవడంతో నాటి నుంచి నాలుగు దఫాల్లో రూ.లక్షల్లోనే రైతు బంధు నగదు జమ అయింది. రైతు బంధుతోపాటు ఒకవేళ పంట రుణాలు ఇచ్చినట్లయితే ఆయా సొమ్మును బ్యాంకర్లు తిరిగి



ఎలా వసూలు చేస్తారనేది సందేహంగా మారింది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు, సింగరేణి సంస్థ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

రికార్డుల్లోంచి తొలగిస్తాం.. సూర్యనారాయణ, ఆర్డీవో

ఆయా సర్వే నంబర్లు ఈ నెల 15లోగా రికార్డుల్లో నుంచి తొలగిపోతాయి. విజయవాడ రోడ్డు డైవర్షన్‌లో కొన్ని సర్వే నంబర్లకు సంబంధించి పరిహారం అందనివి కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పరిహారం ఇచ్చిన కొన్ని భూముల సర్వే నంబర్లు తొలగించాం. రేజర్లలో ఒక బిట్టులో మొత్తం 415 ఎకరాల్లో 350 ఎకరాలు సింగరేణి విస్తరణలో కలుస్తుండగా మిగిలింది రోడ్డు డైవర్షన్‌లో ఉంది. కోర్టు కేసుల్లో కొన్ని సర్వే నంబర్లు ఉండటం వల్ల తొలగించలేదు. తొలగించాల్సిన సర్వే నంబర్ల జాబితాను ఇటీవలే ఉన్నతాధికారులకు పంపాం. బ్యాంకులకు కూడా ఆయా సర్వే నంబర్లకు రుణాలు ఇవ్వొద్దని లేఖలు పంపుతాం. సింగరేణి నుంచి కూడా లేఖలు పంపేలా చర్యలు తీసుకుంటాం.

# మార్కెట్ల ఆదాయ లక్ష్యం రూ.52.27 కోట్లు

మహబూబాబాద్ :జిల్లా పరిధిలోని నాలుగు వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయ లక్ష్యాన్ని మార్కెటింగ్ శాఖ ఖరారు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.52.27 కోట్లు ఆదాయం సమకూర్చుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు రూ.42 కోట్లు, నర్సంపేటకు రూ.6.62 కోట్లు, నెక్కొండకు రూ.1.40 కోట్లు, వర్ధన్నపేట మార్కెట్కు రూ.2.25 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల దిగుబడిపై ప్రభావం పడే అవకాశముందని వ్యవసాయ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో 1.35 లక్షల ఎకరాల్లో వరి, 1.30 లక్షల ఎకరాల్లో పత్తి, 3 వేల ఎకరాల్లో వేరుశనగ, 13 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు మిర్చి సీజన్ కారణంగా సెస్సుల రూపంలో ఎనుమాముల మార్కెట్‌కు రూ.15.83 కోట్ల ఆదాయం వచ్చింది. వర్షాకాలం, యాసంగి సీజన్లలో మార్కెట్‌కు వచ్చే పంట ఉత్పత్తుల ద్వారా మిగిలిన లక్ష్యం సాధించడానికి మార్కెట్ అధికారులు సమాయత్తం అవుతున్నారు.

స్వల్పంగా లక్ష్యం కుదింపు

ఎనుమాముల మార్కెట్ మినహా మిగతా మూడు మార్కెట్లకు గతేడాదితో పోలిస్తే ఈసారి ఆదాయ లక్ష్యం స్వల్పంగా కుదించారు. నాలుగు మార్కెట్లకు గతేడాది రూ.54 కోట్ల లక్ష్యం నిర్దేశించగా.. ఈ ఏడాది రూ.52.27 కోట్లు మాత్రమే విధించారు. గతేడాది ఎనుమాముల మార్కెట్‌కు విధించిన లక్ష్యంలో రూ.4.9 కోట్ల ఆదాయం తక్కువ వచ్చింది. అయినా గతేడాది కన్నా రూ.2 కోట్లు అదనంగా లక్ష్యాన్ని నిర్దేశించారు. పత్తి, మిర్చి సీజన్‌లలో వ్యాపారుల జీరో దందా కారణంగా మార్కెట్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లకు సంబంధించిన ధాన్యం కొనుగోలు బకాయిలను ఎనుమాముల మార్కెట్‌కు రూ.6.41 కోట్లు, నర్సంపేటకు రూ.2.76 కోట్లు, వర్ధన్నపేటకు రూ.1.23 కోట్లు, నెక్కొండకు రూ.76.72 లక్షలు చెల్లించడంతోనే ఆ మేరకు ఆదాయం సమకూరింది.

వందశాతం సాధనకు కృషి..- పాలకుర్తి ప్రసాద్‌రావు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిరాష్ట్ర మార్కెటింగ్‌శాఖ జిల్లాలోని నాలుగు మార్కెట్లకు నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం చేరుకునేలా కృషి చేస్తాం. అందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటాం. గత ఏప్రిల్ నుంచి జూన్ వరకు 32.88 శాతం ఆదాయం మార్కెట్లకు సమకూరింది.

# యథేచ్ఛగా ఇసుక రవాణా

బచ్చన్నపేట : అక్రమ ఇసుక రవాణాకు బచ్చన్నపేట మండలంలోని కొన్ని గ్రామాల పరిధిలో వాగు పరివాహక ప్రాంతాలను కొంతమంది అక్రమార్కులు అడ్డాగా చేసుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా ఇసుక తోడేస్తుండడంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. తాగు, సాగునీటికి సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షాలు కురిసినా నీరు నిల్వ ఉండకపోవడానికి కారణం ఇసుక తరలింపే కారణమని రైతులు అంటున్నారు.

నిత్యం 10–20 ట్రాక్టర్లు...

మండలంలోని చిన్నరాంచర్ల, పోచన్నపేట, సదాశివపేట, ఇటుకాలపల్లి, రామచంద్రపూర్ గ్రామాల మీదుగా వాగు ప్రవహిస్తుంది. ఈ ప్రాంతాల నుంచి అక్రమార్కులు నిత్యం ఇసుకను తరలిస్తూ లక్షలు అర్జిస్తున్నారు. వాగు పక్కన వ్యవసాయదారులకు ఎంతోకొంత డబ్బులు ముట్టజెప్పి, ఆ ప్రాంతాల నుంచి పని కానిచేస్తున్నారు. ఇసుక సమృద్ధిగా లభిస్తుండడంతో ఈ వాగు నుంచి నిత్యం 10–20 ట్రాక్టర్లు నడుస్తున్నాయి. అడ్డుకోవాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలం కేంద్రానికి దగ్గరగా ఉండంతో పగలూ, రాత్రి అనే తేడా లేకుండా తరలిస్తున్నారు.

ముందస్తు సమాచారంతో అప్రమత్తం..

అధికారులు ఏ సమయంలో ఎక్కడ దాడులు చేస్తారో.. వారికి ముందస్తు సమాచారం తెలుస్తుండడంతో వారు అప్రమత్తమవుతున్నారు. వారు పట్టుబడకుండా కొంతమంది సిబ్బంది సహకరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇది ఒక రకం. ఇసుకను తరలించే క్రమంలో ట్రాక్టర్ ముందు ద్విచక్రవాహనంపై ఎస్కార్టులా ఒక వ్యక్తి వెళ్తాడు.



ముందు అధికారుల తనిఖీలు కనిపిస్తే వెంటనే ట్రాక్టర్ డ్రైవర్‌కు ఫోన్ చేసి సమాచారం అందిస్తారు. వారు అప్రమత్తమై.. ట్రాక్టర్‌ను మార్గమధ్యలో నిలుపుతారు. అధికారులు వెళ్లిపోయారని సమాచారం వచ్చాక, అక్కడి నుంచి కదులుతారు. ఇది రెండో రకమైన అక్రమం. ఇలా వ్యాపారులు జాగ్రత్తలు పాటిస్తూ వివిధ ప్రాంతాలకు సరకు తరలిస్తున్నారు.

గ్రామానికో పోలీసు ఏమైనట్టు...

పల్లెలో నేరాలు జరగకుండా, అవినీతి అక్రమాలకు తావు ఇవ్వకుండా, శాంతి భద్రతల పరిరక్షణకు గ్రామానికో పోలీసు సిబ్బంది ఉంటారు. వీరు ఇసుక అక్రమ రవాణను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారు. ఉన్నతాధికారులే అడగడంలేదని, తమకెందుకులే అని కొందరు మిన్నకుండిపోతున్నారు. తరలింపు ప్రక్రియతో ఇటుకాలపల్లి, చిన్నరాంచర్ల, పోచన్నపేట, రామచంద్రపూర్, సదాశివపేట వాగులో ఇసుక లేకుండా పోతుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తరలింపునకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

తరలిస్తే కఠిన చర్యలు: – నాగబాబు, నర్మెట్ట సీఐ

మండలంలోని పలు గ్రామాల్లో తహసీల్దార్ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ట్రాక్టర్ల సీజ్‌తోపాటు కేసు నమోదు చేస్తాం.

# 1340 ఖాళీలు.. 8,408 దరఖాస్తుదారులు

సింగరేణి : సింగరేణిలో అప్రెంటిస్‌షిప్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అభ్యర్థులు పోటీపడుతున్నారు. సంస్థ ఈ దఫా మొత్తం 1,340 మందికి అప్రెంటిస్‌షిప్ కల్పించేందుకు నిర్ణయించగా.. 8,408 మంది పోటీలో ఉన్నారు. ఏటా సింగరేణి ఉద్యోగుల సంఖ్య ఆధారంగా కనీసం వెయ్యి మందికి పైగా ఐటీఐ అభ్యర్థులకు వృత్తి శిక్షణకు అవకాశాన్నిస్తోంది. ఏడాది పాటు ట్రేడ్లను బట్టి రూ.7,700 నుంచి రూ.8,515 వరకు ఉపకార వేతనాన్నీ అందిస్తోంది. యాజమాన్యం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 6వ తేదీ సాయంత్రం వరకు 10,038 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 8,515 మంది హార్డుకాపీలను ఈ నెల 8వ తేదీ నాటికి సమీప వీటీసీల్లో సమర్పించారు. పరిశీలన అనంతరం 8,408 దరఖాస్తులు చెల్లుబాటయ్యాయి.

ముఖ్యాంశాలివే...

లి రెండు సంవత్సరాల ఐటీఐ పూర్తిచేసిన ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మెషనిస్టు, మెకానిక్ మోటార్ వెహికిల్, డ్రాఫ్ట్స్‌మెన్‌లకు నెలకు రూ.8,050, ఒక సంవత్సరం కోర్సు పూర్తిచేసిన డీజిల్ మెకానిక్, వెల్డర్‌లకు నెలకు రూ.7,700 వేతనం అందజేశారు.

లి ఐటీఐ ఉత్తీర్ణతా సంవత్సరాన్ని బట్టి ఎంపికలో ప్రాధాన్యం ఇస్తారు. ఒకే సంవత్సరం చదివిన వారుంటే మార్కులు పరిశీలిస్తారు.

లి స్థానికులకు 95 శాతం, స్థానికేతరులకు 5 శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది.

లి ప్రస్తుతం సింగరేణిలో పనిచేస్తున్న, కొత్తగా చేరిన కార్మికుల్లో ఎవరైనా ఐటీఐ అభ్యర్థులుండి.. వారు దరఖాస్తు చేసుకొంటే తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

లి జనరల్ మజ్దూర్లుగా పనిచేస్తున్న వారికి వయసుతో సంబంధం లేకుండా ఐటీఐ అర్హత ఉంటే వారందరికీ అవకాశాన్ని ఇవ్వనున్నారు.

లి కార్మికులు, వారి వారసులు, సమీపప్రాంత వాసులు, నిర్వాసితులు కాకుండా కనీసం 30 శాతం సీట్లు బయటివారికి వచ్చేలా నిబంధనలు రూపొందించారు.

లి ఎంపిక ప్రక్రియ పూర్తయ్యేందుకు మరో రెండు నెలలు పట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# పురుగుల బియ్యం.. తినేదెలా?



నిర్మల్ : చౌకధరల దుకాణాల నుంచి ప్రస్తుతం బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. నాణ్యతపై ఏ మాత్రం దృష్టి సారించకపోవడం, పర్యవేక్షణ పూజ్యంతో సరఫరా చేసేవి పూర్తిగా పురుగుపట్టి వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులెదుర్కొంటున్నారు. జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, భైంసా, ముథోల్ ఎంఎల్ఎస్ కేంద్రాల పరిధిలో 412 రేషన్ షాపులున్నాయి. 2.10 లక్షల మంది లబ్ధిదారులున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆగస్టు నెలలో కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి 15 కిలోల చొప్పున పంపిణీ చేసింది. అయితే సరఫరా చేసిన బియ్యం పూర్తిగా లక్క, తెల్లని తోక పురుగులుండడంతో వాటిని తీసుకునేందుకు జనం వెనుకంజ వేశారు.

ఆవేదనలో..

రేషన్ బియ్యంపై ఆధారపడి, అవి వస్తేనే పూట గడిపే కుటుంబాలెన్నో ఉన్నాయి. అలాంటి వారికి పంపిణీ చేసిన ఈ పురుగుల బియ్యం తీవ్ర వేదనకు గురి చేస్తోంది. లబ్ధిదార్లు తీసుకోకపోవడంతో పలు చోట్ల నిల్వలు పేరుకుపోయాయి. పంపిణీ చేసినందుకు ప్రభుత్వం డీలర్లకు కిలోకు 70 పైసలు అందజేయనుంది. మిగిలిపోయిన వాటి పరిస్థితి ఏంటోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఒక పక్క లెక్క పక్కా కోసం 4జీ నెట్‌వర్క్ కలిగిన ఈ పాస్ యంత్రాలను అందజేసింది. అయితే క్షేత్రస్థాయిలో స్థానిక రైస్‌మిల్లర్ల నుంచి సరఫరా అయ్యే బియ్యం నాణ్యత, నిల్వల విషయంలో సరైన ప్రమాణాలు పాటించకపోవడంతో ఈ దుష్పరిణామాలు ఎదురవుతున్నాయి. చూసీచూనట్లుగా 'మామూలు'గా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు సైతం ఉన్నాయి. ఇకనైనా అధికారులు ఈ విషయంపై ప్రత్యేక చర్యలు తీసుకొని నాణ్యత కలిగిన వాటిని సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ చౌకధరల దుకాణం–1కి ఆగస్టు నెల కోటా కింద బియ్యం సరఫరా చేశారు. ఇక్కడ 720 మంది లబ్ధిదారులుండగా, వారికి పంపిణీ చేయడానికి సుమారు 300 క్వింటాళ్లు వచ్చాయి. ఇందులో సుమారు 150 క్వింటాళ్ల బియ్యం బస్తాలు తెరిచి చూసిన డీలర్ ఆందోళనకు గురయ్యారు. లక్క, తెల్లని తోక పురుగులు ఉండడంతో వాటిని తీసుకునేందుకు లబ్ధిదారులు అనాసక్తి చూపారు. కొందరు చేసేది లేక తీసుకెళ్లారు. ప్రస్తుతం అక్కడ సుమారు 50 క్వింటాళ్ల బియ్యం నిల్వలు పేరుకుపోయాయి. ఇక్కడే కాకుండా పలుచోట్ల ఇదే పరిస్థితి ఎదురయ్యిందని పలువురు డీలర్లు పేర్కొన్నారు.

ఇవే ఆధారం..– ఓరగంటి నందవ్వ, లబ్ధిదారురాలు, మంజులాపూర్

నేను ఒక్కదానినే ఉంటాను. ఏ పని చెయ్యలేను. ప్రభుత్వం ఇచ్చే పింఛను, ఈ బియ్యమే ఆధారం. ప్రస్తుతం 15 కిలోల బియ్యం వచ్చాయి. అవి చూస్తే పూర్తిగా పురుగులు పట్టి ఉన్నాయి. చేసేది లేక తీసుకోవాల్సి వచ్చింది.

తగిన చర్యలు తీసుకుంటాం– సుధారాణి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి, నిర్మల్

ఆగస్టు నెలకు సంబంధించిన పూర్తి స్థాయి కోటాను లబ్ధిదారులకు అందజేశాం. పురుగులు వచ్చాయన్న విషయంపై క్షేత్రస్థాయిలో వెంటనే పరిశీలిస్తాం. ఇలాంటివి ముమ్మందు జరుగకుండా తగిన చర్యలు తీసుకుంటాం. లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకుండా పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తాం.

చాలా ఇబ్బందులు– తెనుగు ఆశన్న, లబ్ధిదారుడు, మంజులాపూర్

ఇచ్చిన బియ్యంలో పురుగులు, మెరిగలు ఉండడంతో వాటిని ఏరేందుకు చాలా కష్టమవుతోంది. నాకు అంత్యోదయ కింద 35 కిలోలతో పాటు ఈ నెల అదనంగా 20 కిలోలు ఇచ్చారు. అవే మాకు ఆధారం. ఇచ్చిన ఈ బియ్యం తినాలంటే చాలా ఇబ్బందిగా ఉంది.

జిల్లా సమాచారం.. చౌకధరల దుకాణాలు : 412 లబ్ధిదారులు : 2.10 లక్షలు ఎంఎల్ఎస్ కేంద్రాలు : 04 గత నెలలో ఇచ్చింది ఒక్కొక్కరికి : 15 కిలోలు ఆగస్టు మాసం కేటాయింపు: 10వేల మెట్రిక్ టన్నులు

# ప్రాణాలు పోతున్నా.. పట్టింపు సున్నా



ఆసిఫాబాద్ : జిల్లాలోని ప్రభుత్వ వసతిగృహాలు విద్యార్థుల పాలిట మృత్యుకుహరాలుగా మారుతున్నాయి. వారం రోజుల వ్యవధిలో జిల్లాలోని నలుగురు విద్యార్థులు చనిపోయారు. అయిదో తరగతి చిన్నారి నుంచి డిగ్రీ చదువుతున్న యువతి వరకు జ్వరాలతో మృత్యువాతపడ్డారు. జ్వరం వచ్చిన ఒకట్రెండు రోజుల వ్యవధిలోనే వీరంతా చనిపోవడం సర్కారీ వైద్య సేవలను, వసతిగృహాల నిర్వహణను, పర్యవేక్షణను తేటతెల్లం చేస్తుంది. జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి అధికారులెవరూ హాస్టళ్లను సందర్శించడం లేదు. ఫిర్యాదులు వచ్చినా, విద్యార్థులు ధర్నాలు చేస్తున్నా, విధులను సక్రమంగా నిర్వహించని వారిపై చర్యలు తీసుకునే ఊసే లేకుండాపోయింది.

కుటుంబ పోషణ కోసం అష్టకష్టాలు పడుతున్న పేదలు తమ పిల్లలకైనా నాణ్యమైన భోజనం, విద్య లభిస్తుందని ప్రభుత్వ గురుకులాలు, వసతిగృహాల్లో చేర్పుతున్నారు. అయితే చిన్నారులు మృత్యుఒడిలోకి చేరుకోవడంతో కన్నవారికి కడుపుకోత మిగులుతోంది. ఒక ఘటన జరగగానే పూర్వపరాలు పరిశీలించి, వసతిగృహాల నిర్వహణను గాడిలో పెట్టాల్సిన జిల్లా యంత్రాంగం ప్రేక్షక పాత్రకు పరిమితమవుతోంది

గిరిజన డిగ్రీ కళాశాలను మార్చుతాం– వరుణ్‌రెడ్డి, ఐటీడీఏ పీఓ

ఆసిఫాబాద్ డిగ్రీ కళాశాల ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. గదుల కొరత ఉంది. త్వరలోనే ఈ వసతిగృహాన్ని మరో చోటకు మార్చి విద్యార్థుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం.

కన్నవారి ఆశలను తెంచుతూ...– అయిదుగురు ఆడపిల్లల్లో మూడో సంతానం ఆమె. డిగ్రీ చదివి ఏదైనా ఉపాధితో తండ్రి కష్టాలు తీర్చుతూ, కుటుంబానికి ఆసరాగా ఉండాలన్నది ఈ యువతి సంకల్పం. కానీ తల్లిదండ్రులకు, అక్కాచెల్లెళ్లకు తీరని వేదనను మిగుల్చుతూ కానరాని లోకాలకు వెళ్లిపోయింది. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న లావుడ్యా సంగీత(19)ను గత సోమవారం జ్వరం వచ్చిందని అధ్యాపకులు జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల, అటు నుంచి కరీంనగర్‌కు తరలించగా ఆసుపత్రిలో మృతి చెందింది. నృత్యంతో పాటు, ఆటపాటలు, క్రీడలు, చదువులో ముందుండే సంగీత మరణంతో కుటుంబ సభ్యులతో పాటు, సహచరులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. హైడోస్ ఇంజక్షన్ మృతికి కారణమని కళాశాల సిబ్బంది, జ్వరానికి సకాలంలో చికిత్స అందకనే ఆరోగ్యం విషమించిందని వైద్యులు పేర్కొనడం గమనార్హం.

ఒక్కగానొక్క కొడుకు..

– పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆలం రాజేశ్(15) పదో తరగతి చదువుతున్నారు. జ్వరంతో బాధపడుతూ ఆగస్టు 25న చనిపోయాడు. విద్యార్థికి జ్వరం వస్తుందని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు చెప్పగా.. 21న ఇంటికి తీసుకెళ్లారు. కాగజ్‌నగర్ ఆసుపత్రిలో పరీక్షలు చేయగా రక్తం కేవలం 2.6 గ్రాములు మాత్రమే ఉంది. బాటిల్ రక్తం ఎక్కించినా ప్రాణాలు నిలవలేదు. ఒక్కగానొక్క కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రుల రోదలను మిన్నంటాయి.

ఆడి పాడే వయసులోనే..

– తిర్యాణి మండలంలోని తోయగూడకు చెందిన టేకం రమేశ్(12).. అదే మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ వసతిగృహంలో 5వ తరగతి చదువుతున్నాడు. గత నెల 27న తల్లిదండ్రులు శ్యాంరావ్–బాయి ఇంటికి తీసుకెళ్లారు. మరుసటి రోజు జ్వరం రాగా సమీపంలోని గోలేటి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. 29న బాలుడు మృతి చెందాడు. రెండు రోజుల జ్వరానికే బాలుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

– సిర్పూర్(టి) గురుకుల పాఠశాలలో మంచిర్యాల జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన అశ్విని(12) అయిదో తరగతి చదువుతోంది. ఆగస్టు 25న బాలిక ఆరోగ్యం బాగోలేదని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వీరు కాగజ్‌నగర్, మంచిర్యాల, కరీంనగర్ ఆసుపత్రులకు చికిత్స నిమిత్తం తరలించినా ప్రాణాలు నిలవలేదు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు సకాలంలో సమాచారం ఇవ్వలేదని బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

# వృథాగా పడవలు.. నిరాశలో పర్యాటకులు

నిర్మల్ : కడెం జలాశయం వద్ద పర్యాటకశాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పడవలు నెలరోజులకు పైగా వృథాగానే ఉంటున్నాయి. గతనెలలో వచ్చిన వరదల సమయంలో డీలక్స్‌బోటు మోటారు నీటిలో తడిసి పాడైందని మరమ్మతుల కోసం హైదరాబాద్ పంపించారు. 40 రోజులు గడిచినా మోటారు మెరుగుపరిచి పంపించలేరు. ఖాళీ అయిన కడెం జలాశయం మళ్లీ 15 రోజులుగా నిండానీటితో జలకళను సంతరించుకోవడంతో దూరప్రాంతాల నుంచి సందర్శకులు వస్తున్నారు.సరదాకు వస్తే నిరుత్సాహంవివిధ ప్రాంతాల నుంచి బంధుమిత్రులతో, పిల్లాపాపలతో కాలక్షేపం కోసం వచ్చినవారంతా బోటింగు లేదా..? అంటూ నిరుత్సాహపడుతున్నారు. స్పీడ్ బోటు మోటారుసైతం కొద్దినెలల క్రితమే పాడవడంతో దాన్నీ అప్పట్లోనే మరమ్మతులకు పంపారు. అదీ రాకపోవడంతో స్పీడ్‌బోటును పక్కన పెట్టేశారు. రెండు పడవలకు మోటార్లు లేక జలాశయం వద్ద వృథాగా ఉండి పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచలేకపోతున్నాయి. కడెం జలాశయం వరదగేట్ల మరమ్మతులన్నీ పూర్తయి నీటిమట్టాన్ని పెంచారు.

# ఆత్మలకు పింఛన్లు..!

మహబూబాబాద్ : ఆసరా పింఛను మంజూరు చేసిన అధికారులు క్షేత్రస్థాయిలో వాటి చెల్లింపులపై దృష్టి సారించడం లేదు. ఎంతమందికి అందుతున్నాయి.. లబ్ధిదారులు జీవించి ఉన్నారా.. ఎక్కడైనా మరణించారా అనే సమాచారం తీసుకోవడంలో సరైన శ్రద్ధ చూపడం లేదు. దీంతో కొన్ని చోట్ల మృతి చెందిన వారి పేరిట వస్తున్న పింఛను అడ్డదారిలో తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో 16 మండలాల్లో వివిధ విభాగాల్లో 90,716 మందికి పింఛన్లు వస్తున్నాయి. అక్కడక్కడ మృతి చెందినవారి పేర్ల మీదనే కాకుండా పలు గ్రామాల్లో అనర్హులు కూడా పొందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా దివ్యాంగుల కోటాలో అధికంగా బోగస్ పింఛన్‌దారులున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

లి మహబూబాబాద్ పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలో ఓ వ్యక్తి ఏడాది కిందట మృతి చెందారు. పింఛన్ ఓ బ్యాంకులో జమ అవుతుండడంతో కుటుంబ సభ్యులు ఏటీఎం ద్వారా బ్యాంకులో మూడు నెలల వరకు పింఛన్ తీసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వారసత్వ సర్టిఫికెట్ పొందడం కోసం పురపాలక సంఘం కార్యాలయంలో మరణ ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేశారు. అక్కడ పింఛను వస్తున్నట్లు గుర్తించి ఆసరా పింఛన్ లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించారు. డబ్బులు తిరిగి రికవరీ చేయలేదు.



లి మహబూబాబాద్‌కు సమీపంలోని ఓ గిరిజన తండాలో కూడా మృతి చెందిన వ్యక్తి పేరు మీద పంచాయతీ కార్యదర్శి, ఆ కుటుంబానికి చెందిన వ్యక్తి రెండు నెలలు పింఛన్ పొందారు. వృద్ధుడి వేలిముద్రలు యంత్రంలో పడడం లేదని చెప్పి కార్యదర్శి వేలిముద్ర వేసి డబ్బులు తీసుకుంటున్న విషయం గుర్తించిన కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పడంతో జాబితాలో మృతుడి పేరు తొలగించారు.

లి కేసముద్రం మండలంలోని ఓ గ్రామంలో చిన్న వైకల్య లోపం కలిగిన ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు దివ్యాంగుల సర్టిఫికెట్ పొంది పింఛను పొందుతున్నట్లు గుర్తించిన వికలాంగుల సంఘానికి చెందిన ఒక నాయకుడు వారిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తే అతనిపై దాడికి యత్నించిన సంఘటనలున్నాయి.

గుర్తిస్తేనే తొలగిస్తున్నారు

ఆసరా లబ్ధిదారుల్లో ఎవరైనా మృతి చెందినట్లు స్వయంగా కుటుంబ సభ్యులు, ఇతర వ్యక్తులు సమాచారం ఇస్తేనే అప్పుడు గుర్తించి వారి పేర్ల జాబితాల నుంచి తొలగిస్తున్నారు. ప్రధానంగా పట్టణాల్లో పురపాలక సిబ్బంది జనన, మరణాలపై ఎవరూ దృష్టి సారించడం లేదు. మృతి చెందిన వ్యక్తికి సంబంధించి అవసరం ఉండి మరణ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు మాత్రమే లబ్ధిదారులు చనిపోయినట్లు గుర్తించి వారి పేర్లను ఆ జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఈలోపు కొందరు పింఛను సొమ్ము బ్యాంకుల నుంచి ఏటీఎం, ఫోన్ పే, గూగూల్ పే ద్వారా తీసుకుంటున్నట్లు సమాచారం.

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం–ఆర్.సన్యాసయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి

మృతి చెందిన లబ్ధిదారుల పేరిట పింఛన్ పొందుతున్నట్లు ఫిర్యాదులు వస్తే తగిన చర్యలు తీసుకుంటాం. విచారణ చేసి ఆధారాలు ఉంటే వారు పొందిన సొమ్ము సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేయిస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో తపాలా శాఖాధికారులు వేలి ముద్రలు వేయించి పింఛను ఇస్తున్న క్రమంలో ఇతరులకు చెల్లించే అవకాశం ఉండదు. పట్టణ ప్రాంతాల్లో మాత్రం బ్యాంకుల ద్వారా జమ అవుతున్నందున ఇతర మార్గాల ద్వారా వారు మృతి చెందిన వారి ఖాతా నుంచి డబ్బులు తీసుకునే అవకాశం ఉంది. మా వద్దకు వచ్చిన సమాచారం మేరకు మరణించిన పింఛనుదారుల పేర్లు తొలగిస్తున్నాం.

# దోమలు బాబోయ్..

మహబూబాబాద్ : దోమలు బాబోయే దోమలు. ఉదయం, పగలు, రాత్రి తేడా లేకుండా ఈగల్లా స్వైర విహారం చేస్తున్నాయి. దోమ కాటుతో నగర ప్రజలు జ్వరాల బారిన పడ్డారు. మురికివాడల్లో వ్యాధులు ముసురుకున్నాయి. పేదల బస్తీల్లో ఇంటింటా జ్వరాల బాధితులే. డెంగీ కేసులు చాప కింద నీరులా రోజు రోజుకు పెరుగుతున్నాయి. వరంగల్ 29వ డివిజన్ ఓఎస్‌నగర్‌లో ఒక్కరికి డెంగీ వ్యాధి సోకింది. కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లోని ఏ కాలనీకి వెళ్లినా జ్వరాలతో మంచం పట్టారు. గత ఐదారేళ్లుగా ఎప్పుడు లేనంతగా వరంగల్ నగరంలో జ్వరాల బాధితులు వేల సంఖ్యలో పెరుగుతున్నారు. ఎంజీఎం, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్ఎంపీల వద్ద రోగులు బారులు తీరుతున్నారు. దోమలతోనే విషజ్వరాలు ప్రబలుతున్నాయని వైద్యులంటున్నారు. కాలానుగుణ వ్యాధులపై అప్రమతంగా ఉండాలని రాష్ట్ర పురపాలక శాఖ హెచ్చరించినప్పటికి గ్రేటర్ వరంగల్ ముందస్తు చర్యలు అంతంతా మాత్రమే. ప్రజారోగ్యం, అర్బన్ మలేరియా విభాగాల మధ్య సమన్వయ లోపంతో దోమల నివారణ చర్యలు పక్కా ప్రణాళిక ప్రకారం కొనసాగడం లేదనే విమర్శలున్నాయి.

కాలనీల్లో పరిస్థితి ఇలా..

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కాలనీల్లోని ప్రైవేటు ఖాళీ స్థలాలు చెరువులు, కుంటలను తలపిస్తున్నాయి. రోజుల తరబడి నీళ్లు నిల్వ ఉండటంతో కోట్లలో లార్వా పుట్టుకొస్తుంది. ఇళ్ల చుట్టూ ఉన్న ఖాళీ స్థలాలతో దోమల బెడద ఎక్కువైంది. ఇంటింటా చెత్త సేకరణ రోజూ జరగడం లేదు. ఇళ్లలో పోగైన చెత్తను మురుగు కాల్వల్లో పడేయటంతో దోమల సమస్య పెరిగింది.

కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లో 183 మురికివాడలున్నాయి. చాలా కాలనీల్లో అంతర్గత డ్రైయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ఇళ్ల మధ్య మురుగు పారుతుంది.

లిహంటర్‌రోడ్డు, ఎన్టీఆర్‌నగర్, సంతోషిమాత కాలనీ, ఓఎస్‌నగర్, రఘునాథ్ కాలనీ, పాపయ్యపేట, రామన్నపేట, పోతననగర్, గిరిప్రసాద్‌నగర్, బీఆర్‌నగర్, డీకేనగర్, ఎంహెచ్‌నగర్, కేఎల్ మహేంద్రనగర్, పెద్దమ్మగడ్డ, సమ్మయ్యనగర్, పద్మాక్షికాలనీ, కాజీపేట దర్గా తదితర కాలనీల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి.

హనుమకొండ ప్రాంతం పెద్దమ్మగడ్డ, లోటస్ కాలనీ, కుమార్‌పల్లి, యాదవనగర్, న్యూశాయంపేట, పద్మాక్షికాలనీ, దీనదయాళ్‌నగర్ కాలనీల్లో దోమల సమస్య ఎక్కువగా ఉందని స్థానిక ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి.

నివారణ చర్యలు ముమ్మరం– గుండు సుధారాణి, మేయర్, గ్రేటర్ వరంగల్

వరంగల్ నగరంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలుతున్నాయి. దోమల నివారణ చర్యలు ముమ్మరం చేశాం. ప్రత్యేక టీంలను రంగంలోకి దించుతాం. పారిశుద్ధ్యం పనులు పక్కాగా జరిగేలా చూస్తాం. ప్రతి ఆదివారం ఉదయం పది గంటలకు పది నిముషాల కార్యక్రమం పక్కాగా చేపడుతున్నాం.

# వాలంటీర్ల తీరుతో ప్రమాదం పొంచి ఉంది: చంద్రబాబు



అమరావతి: భాజపాతో తెదేపా పొత్తుంటుందంటూ కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ అధినేత చంద్రబాబు స్పందించారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ఎవరెవరో మాట్లాడిన వాటిపై స్పందించి చులకన కాదల్చుకోలేదని వ్యాఖ్యానించారు. వాలంటీర్ల వ్యవస్థపైనా ఆయన మాట్లాడారు. "దగాపడ్డ ఏపీ రాష్ట్ర ప్రయోజనాలే ఇప్పుడు నాకు ముఖ్యం. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే నా లక్ష్యం. పెద్ద బాధ్యత నాపై ఉన్నప్పుడు పెద్ద ఆలోచనలూ అవసరం. పోరాడితే కేంద్రం దిగొస్తుందనడానికి జల్లికట్టు ఘటనే ఉదాహరణ. ఓట్ల అవకతవకలపై ఢిల్లీ వరకు వెళ్లి పోరాడతాం. వాలంటీర్లు పౌరసేవకు పరిమితం కాకుండా రాజకీయాల్లో జోక్యం చేసుకుంటే కుదరదు. వ్యక్తిగత సమాచారాన్ని వాలంటీర్లు సేకరించడం ద్రోహం.. దీనివల్ల చాలా ప్రమాదం పొంచి ఉంది. తెదేపా అధికారంలోకి వస్తే ప్రజాసేవ వరకే వాలంటీర్ల సేవలు పరిశీలిస్తాం" అని చంద్రబాబు చెప్పారు.

**బీజేపీతో టీడీపీ పొత్తుంటుందన్న కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై స్పందించిన చంద్రబాబు –** ఆంధ్రప్రదేశ్‌లో పొత్తులపై ఓ క్లారిటీ వచ్చినట్టేనా? తాజాగా కేంద్ర మంత్రి నారాయణ స్వామి అనంతపురం జిల్లాకు వచ్చారు. ఏపీలో పొత్తులు ఉంటాయని.. బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు. మొత్తానికి ఆయన వ్యాఖ్యలు ఇప్పుడు తెగ వైరల్ అవుతున్నారు. తాజాగా కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై టీడీపీ అధినేత చంద్రబాబు స్పందించారు. దగా పడ్డ ఏపీ రాష్ట్ర ప్రయోజనాలే ఇప్పుడు తనకు ముఖ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. దీనిపై ప్రజల్లో అవగాహన చైతన్యం తీసుకొచ్చి సెట్ చేయటమే తన ముందున్న లక్ష్యమన్నారు. పెద్ద బాధ్యత తనపై ఉన్నప్పుడు పెద్ద ఆలోచనలూ అవసరమన్నారు. ఎవరెవరో మాట్లాడే వాటికి ఇప్పుడు స్పందించి చులకన కాదల్చుకోలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర సమస్యలపై ప్రభుత్వం–ప్రజలు గట్టిగా ఉంటే కేంద్రం ఎందుకు దిగి రాదనటానికి జల్లికట్టు ఘటనే ఓ ఉదాహరణ అని పేర్కొన్నారు. గత నాలుగన్నరేళ్లుగా జగన్మోహన్ రెడ్డి ఆ స్థాయి పోరాటానికి కనీస ప్రయత్నం చేశాడా? అని ప్రశ్నించారు. ఓట్ల అవకతవకలపై ఢిల్లీని కూడా వదిలిపెట్టబోమన్నారు. అక్రమాలు సరిదిద్దకపోతే ఎన్నికల సంఘం విశ్వసనీయత కూడా పోతుందన్నారు.

# వైసీపీ ఫేక్ ప్రచారంపై లోకేశ్ న్యాయపోరాటం.. రెండు రోజులు పాదయాత్రకు బ్రేక్



అమరావతి: టీడీపీపైన, టీడీపీ నేతలపై వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని గట్టిగా ప్రతిఘటించాలని తెలుగుదేశం నిర్ణయించింది. న్యాయపోరాటం చేసేందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్వయంగా రంగంలోకి దిగారు. గుర్రంపాటి దేవేందర్ రెడ్డి, పోతుల సునీతలపై క్రిమినల్ కేసులు దాఖలు చేశారు. మంగళగిరి మెజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ కేసులు నమోదు చేశారు. దీనికి సంబంధించి మంగళగిరి అడిషినల్ మేజిస్ట్రేట్ ముందు లోకేశ్ వాంగ్మూలం ఇవ్వనున్నారు. ఆ కారణంగా ఈనెల 13, 14 తేదీలలో (రేపు, ఎల్లుండి) యువగళం పాదయాత్రకు బ్రేక్ పడనుంది. తనపైనా, తన కుటుంబంపైనా అసత్య ఆరోపణలని ప్రచారం చేస్తున్న వైసీపీ నేతల ఫేక్ ప్రచారంపై యువనేత నారా లోకేశ్ న్యాయపోరాటం మొదలుపెట్టారు. గతంలో తప్పుడు వార్తలు రాస్తూ, తనని అప్రతిష్టపాలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న సాక్షిపై పరువునష్టం దావా వేయాలని నిర్ణయించారు. అనంతరం వైసీపీ నేతలు, సోషల్ మీడియా బాధ్యులు కూడా తనని టార్గెట్ చేస్తూ చేసిన అసత్య ప్రచారంపై క్రిమినల్ కేసులు దాఖలు చేశారు. వైసీపీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్, ఏపీ ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఏపీ ప్రభుత్వ చీఫ్ డిజిటల్ డైరక్టర్ గుర్రంపాటి దేవేందర్ రెడ్డి, వైసీపీ ఎమ్మెల్సీ పోతుల సునీతలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంగళగిరి మెజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ కేసులు దాఖలు చేశారు. లోకేశ్ పిన్ని కంఠమనేని ఉమామహేశ్వరి అనారోగ్య సమస్యలతో బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఆత్మహత్యపై వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గుర్రంపాటి దేవేందర్ రెడ్డి లోకేశ్‌పై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేశారు. ఉమామహేశ్వరి మరణానికి జూబ్లీ రోడ్డు నెం.45 సర్వే నెం. 273, 274, 275, 276 లలోని 5.73 ఎకరాల భూమి వివాదమే కారణం అంటూ తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా విషప్రచారం చేశారు. అయితే ఆ వివాదం, ఆ సర్వే నంబర్లూ ఫేక్ అని తేలింది.

అయినా గుర్రంపాటి దేవేందర్ రెడ్డి మరో కట్టుకథ అల్లి ప్రచారంలో పెట్టారు. హెరిటేజ్‌లో రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టిన ఉమామహేశ్వరిని మోసం చేయడంతో ఆమె ఆత్మహత్య చేసుకుందని తప్పుడు రాతలు రాశారు. తప్పుడు రాతలపై గుర్రంపాటి దేవేందర్ రెడ్డికి తన లాయర్ దొద్దాల కోటేశ్వరరావు ద్వారా నోటీసులు పంపారు. గుర్రంపాటి దేవేందర్ రెడ్డి వైసీపీ సోషల్ మీడియా కో – ఆర్డినేటర్, ఏపీ ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఏపీ ప్రభుత్వ చీఫ్ డిజిటల్ డైరక్టర్‌గా పనిచేస్తుండడంతో ఆయా కార్యాలయాలకు నోటీసులు పంపగా.. వారు నిరాకరించారు. చివరకి గుర్రంపాటికి వాట్సప్ ద్వారా నోటీసులు పంపారు.




ఢిల్లీ: భారీ వర్షాలు ఉత్తరాదిన జల ప్రళయం సృష్టిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది మహోగ్రరూపం దాల్చింది. 45 ఏళ్ల క్రితం నాటి రికార్డును దాటి.. చరిత్రలో తొలిసారి నది నీటిమట్టం ఆల్‌టైం గరిష్ఠానికి చేరింది. దీంతో అనేక కాలనీల్లో వరద నీరు చేరింది. కేంద్ర జల కమిషన్ సమాచారం ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి ఢిల్లీ పాత రైల్వే బ్రిడ్జి వద్ద యమునా నది నీటి మట్టం 207.55 మీటర్లకు పెరిగింది. హరియాణా నుంచి నీటిని విడుదల చేయడంతో ఢిల్లీలో యుమనా నది ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. ఈ నది ప్రమాదకర స్థాయి 205.33 మీటర్ల కాగా.. ఆ మార్క్‌ను రెండు రోజుల క్రితమే దాటింది. 2013 తర్వాత మళ్లీ బుధవారం ఉదయమే 207 మార్క్‌ను తాకిన నది నీటిమట్టం.. ఈ మధ్యాహ్నానికి ఏకంగా 207.55 మీటర్లుగా నమోదైంది. ఈ స్థాయిలో నది నీటిమట్టం పెరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

**కేంద్రం జోక్యం కోరిన కేజ్రీవాల్ :** ఢిల్లీలో యమునా నది ఉప్పొంగి ప్రవహిస్తూ ప్రమాద ఘంటికలు మోగిస్తుండటంతో ఢిల్లీ సీఎం అర్విండ్ కేజ్రీవాల్ కేంద్రం జోక్యాన్ని కోరారు. యమునా నది నీటి మట్టం స్థాయిలు మున్ముందు పెరగకుండా చూడాలని ట్విటర్‌లో విజ్ఞప్తి చేశారు. కేంద్ర జలసంఘం అంచనా వేస్తున్నట్టు 207.72 మీటర్లకు నీటి మట్టం స్థాయి పెరిగితే.. ఢిల్లీకి మంచిదికాదన్నారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో వర్షాలు పడకపోయినప్పటికీ యమునా నది జలాలు అసాధారణ స్థాయిలో పెరుగుతున్నాయన్న కేజ్రీవాల్.. హరియాణాలోని హత్నికుండ్ బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేయడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. అందువల్ల, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని యమునా నీటి స్థాయిలు పెరగకుండా జోక్యం చేసుకోవాలని కోరారు. 1978లో యమునా నది నీటి మట్టం 207.49 మీటర్లకు చేరడంతో ఢిల్లీలో భీకర వరదలు సంభవించాయి. ఇప్పుడు ఆ రికార్డును కూడా దాటడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే తీర ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించారు. మరోవైపు ప్రజలు నివసిస్తున్న కొన్ని కాలనీల్లోకి వరద ముంచెత్తింది. ఇళ్లు, మార్కెట్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

**కేజ్రీవాల్ అత్యవసర భేటీ..** వరద పరిస్థితుల నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఉన్నతాధికారులతో అత్యవసంగా సమావేశమయ్యారు. వరద ముప్పును ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

మరోవైపు, వరదలు సంభవించే అవకాశమున్న ప్రాంతాల్లో ఢిల్లీ పోలీసులు ముందు జాగ్రత్తగా 144 సెక్షన్ విధించారు.

# నీతులు చెప్పి.. ఆపై మందు కొట్టి



తూర్పుగోదావరి : జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల వాలంటీర్లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం బస్టాండు కూడలిలో వాలంటీర్లు పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం యర్నగూడెం నుంచి కొందరు వాలంటీర్లు దేవరపల్లి వచ్చి బస్టాండు కూడలిలో రాస్తారోకో చేసి పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలని ధ్వజమెత్తారు. అనంతరం దేవరపల్లి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న మద్యం దుకాణంలో 8 మంది వాలంటీర్లు రెండు ఫుల్‌బాటిల్స్ తీసుకుని మద్యం తాగారు. పవన్ కల్యాణ్ మద్యం తాగి మాట్లాడుతున్నారు.. నోరు అదుపులో పెట్టుకోవాలని విమర్శించిన ఒక వాలంటీరు నిరసన అనంతరం తోటి వాలంటీర్లతో మద్యం తాగడం గమనార్హం.




చెన్నై: కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పాదయాత్రకు సన్నద్ధం అవుతోన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వార్త తమిళనాట హాట్ టాపిక్‌గా మారింది. సినీ రంగంతో పాటు రాజకీయ రంగంలోనూ ఈ న్యూస్ ప్రకంపనలు సృష్టిస్తోంది. గతకొన్ని రోజులుగా విజయ్ పొలిటికల్ ఎంట్రీ ఇవ్వనున్నారంటూ వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. మరికొన్ని రోజుల్లో పాదయాత్ర చేయాలని ఆయన నిర్ణయించుకున్నట్లు కొన్ని జాతీయ మీడియాల్లో వార్తలు వస్తున్నాయి. ఇటీవల కాలంలో ఈ హీరో 'విజయ్ మక్కల్ ఇయక్కం' అభిమాన సంఘం సభ్యులతో తరచూ భేటీ అవుతున్నారు. ఈ మేరకు నిన్న కూడా వారితో ఓ సమావేశం ఏర్పాటు చేశారట. అందులోనే పాదయాత్రపై నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయన నటించిన తాజా చిత్రం 'లియో' విడుదల కంటే ముందే తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయాలనుకుంటున్నారట. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. లియో చిత్రం అక్టోబర్ 19న విడుదల కానుంది. ఈలోపు విజయ్ తన నిర్ణయాన్ని ప్రకటించే అవకాశమున్నట్లు సమాచారం. ఇక ఇటీవల విజయ్ తమిళనాడు రాష్ట్రంలోని నియోజకవర్గాల వారీగా టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. చెన్నై వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో.. విద్యార్థులకు సర్టిఫికేట్స్, నగదు ప్రోత్సాహం అందించి అభినందించారు. ఇవ్వన్నీ చూస్తుంటే ఆయన రాజకీయ రంగ ప్రవేశం ఖాయమనే అనిపిస్తోందంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇక నిన్న జరిగిన 'విజయ్ మక్కల్ ఇయక్కం' మీటింగ్‌కు వెళ్లే సమయంలో విజయ్ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఆయనకు రూ.500 జరిమానా విధించారు. ఇక సినిమాల విషయానికొస్తే.. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో విజయ్ 'లియో'లో నటించారు. ఇటీవలే దీని చిత్రీకరణ పూర్తయింది. దీని తర్వాత వెంకట్ ప్రభుతో ఓ సినిమాను ఓకే చేశారు. అలాగే తాజాగా దర్శకుడు శంకర్‌తో ఓ మూవీ చేయడానికి చర్చలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు రానున్న ఎన్నికల్లో ఆయన పోటీచేయనున్నారనే వార్తలు కూడా జోరుగా ప్రచారమవుతున్నాయి.




శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో జనసేన కార్యకర్తల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. జనసేన అధినేత పవన్‌పై సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా పట్టణంలోని పెళ్లిమండం వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు జనసేన నేతలు యత్నించారు. అయితే దిష్టిబొమ్మ దహనానికి అంగీకరించబోమని మహిళా సీఐ అంజు యాదవ్ వారికి తెలిపారు. ఆ తర్వాత దిష్టిబొమ్మ దహనానికి యత్నించడంతో పలువురు నేతలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. జన సేన నేతలు పోలీసులను ఏమార్చి కూడలి వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో జనసేన నేతలపై సీఐ చేయిచేసుకున్నారు. ఓ నేత రెండు చెంపలపైనా ఆమె కొట్టారు. సీఐ దురుసు ప్రవర్తన ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆమె తీరుపై జనసేన కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# కావాలనే వాలంటీర్లను రెచ్చగొడుతున్నారు



పశ్చిమగోదావరి: రాష్ట్రంలో ప్రభుత్వం మారాలనే ఆకాంక్షతో ప్రజలు వారాహి యాత్రకు పెద్దఎత్తున స్వాగతం పలుకుతున్నారని జనసేన పార్టీ పీఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ సమస్యలపైన విమర్శిస్తున్నరూ కానీ ఎవరిని వ్యక్తిగతంగా విమర్శించట్లేదని స్పష్టం చేశారు. ఎందుకు ప్రజల వ్యక్తిగత సమాచారం తీసుకుంటున్నారు అని ప్రశ్నించారు. జనసేన పార్టీ లోతుగా అధ్యయనం చేసిన తరువాత మాత్రమే మాట్లాడుతుందన్నారు. ఎందుకు ఇంత డేటా బేస్ ప్రజల నుంచి కలెక్ట్ చేస్తున్నారో, ఎక్కడికి పంపుతున్నారో ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వాలంటీర్లు ప్రభుత్వ కార్యకర్తలు కాదా?... కావాలనే వాలంటీర్లను రెచ్చగొడుతున్నారని నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పంచాయతీ ఎన్నికల్లో దీదీ జోరు.. 34వేల స్థానాల్లో టీఎంసీ గెలుపు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ హవా కొనసాగుతోంది. ఈ ఎన్నికల ఫలితాల్లో టీఎంసీ భారీ విజయం దిశగా దూసుకెళ్తోంది. మంగళవారం ఉదయం 11.30 గంటల వరకు వెలువడిన ఫలితాల ప్రకారం.. 63వేల పంచాయతీల్లో టీఎంసీ ఏకంగా 34,560 పంచాయతీ స్థానాల్లో విజయం సాధించింది. మరో 705 చోట్ల ఆధిక్యంలో ఉంది. తన ప్రధాన ప్రత్యర్థి భాజపా 9,621 స్థానాల్లో గెలిచి.. మరో 169 స్థానాల్లో ముందంజలో కొనసాగుతోంది. సీపీఎం 2,908 చోట్ల గెలిచి 86 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. కాంగ్రెస్ 2,515 స్థానాలను దక్కించుకుని 71 స్థానాల్లో ముందంజలో కొనసాగుతోంది. మూడంచెల పంచాయతీ వ్యవస్థ అమల్లో ఉన్న బెంగాల్లో మొత్తం 73,887 స్థానాలకు శనివారం ఎన్నికలు జరిగాయి. ఇందులో గ్రామ పంచాయతీలు 63,229 ఉన్నాయి. మిగిలిన వాటిలో 9,730 పంచాయతీ సమితులు, 928 జిల్లా పరిషత్తు సీట్లు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఓట్ల లెక్కింపు మొదలవ్వగా.. రేపు సాయంత్రానికి పూర్తి ఫలితాలు వచ్చే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు. ఇక, పంచాయతీ సమితుల్లో టీఎంసీ ఇప్పటికే 6,228 స్థానాలను దక్కించుకోగా.. మరో 218 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. భాజపా 960 సమితిల్లో గెలిచి.. మరో 50 చోట్ల ముందంజలో కొనసాగుతోంది. మొత్తం 928 జిల్లా పరిషత్తు సీట్లలో తృణమూల్ 592 స్థానాలను కైవసం చేసుకుంది. మరో 188 చోట్ల ఆధిక్యంలో ఉంది. భాజపా కేవలం 18 స్థానాలను మాత్రమే దక్కించుకోగలిగింది. మరో 9 చోట్ల ముందంజలో ఉంది.

**మరో ముగ్గురి మృతి..** మరోవైపు, కౌంటింగ్ సమయంలోనూ బెంగాల్‌లో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘటనల్లో ముగ్గురు మరణించగా.. ఓ పోలీసు అధికారి గాయపడినట్లు పోలీసులు తెలిపారు. బెంగాల్‌లో గత శనివా రం పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పెద్ద ఎత్తున హింస చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనల్లో 15 మంది ప్రాణా లు కోల్పోయారు. ఘర్షణల నేపథ్యంలో కొన్ని చోట్ల పోలింగ్‌ను నిలిపివే శారు. అలా 696 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం రీపోలింగ్ నిర్వహించారు.

# అధిక ధరలు ఉన్నంత వరకు సబ్సిడీపై టమాటాలు అందిస్తాం : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



విజయవాడ: టమాటా ధర తక్కువైనా..ఎక్కువైనా రైతులను, వినియోగదారులను ఆదుకుంటామమని, అధిక ధరలు ఉన్నంత వరకు సబ్సిడీపై టమాటా అందిస్తామని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కృష్ణలంక రైతు బజార్‌ను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సందర్శించారు.రైతు బజారులో వినియోగదారులతో మంత్రి మాట్లాడారు. సబ్సిడీపై అందిస్తున్న టమాటా కౌంటర్‌ను మంత్రి పరిశీలించారు. 103 రైతు బజార్లలో సబ్సిడీ టమాటా ఇస్తున్నామని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ..వినియోగదారులు నష్టపోవద్దనే సీఎం వైయస్ జగన్ ఆలోచన అన్నారు. వినియోగదారులకు జరుగుతున్నా మేలును పక్కదారి పట్టించాలన్నదే టీడీపీ ప్రయత్నమని మండిపడ్డారు. ఇప్పటి వరకు టీడీపీ ఎన్ని టన్నుల టమాటాలు ఇచ్చింది ప్రశ్నించారు. పబ్లిసిటీ కోసం 10 కేజీలు అమ్మి ఫోటోలకు ఫోజులిస్తే సరిపోదన్నారు.

## వైట్ టైటిఫిట్ లో మెరిసిపోతున్న ఆండ్రియా..!

తమిళ సినీ ఇండస్ట్రీలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న నట్లో ఆండ్రియా జెరెమియా ఒకరు. విభిన్న చిత్రాల తో ఆమె అక్కడివారి ని ఆకట్టుకున్నారు. ఇప్పటి వరకు ఆమె చాలా సినిమాల్లో నటించారు. తమిళ్ డబ్బింగ్ సినిమా లతో తెలుగు ప్రేక్షకుల ను అలరించింది ఆండ్రియా. ఇక్కడి ప్రేక్షకుల కు కూడా చేరువయ్యారు. డైరెక్ట్ గా తెలుగు లోనూ ఓ సినిమా లో నటించారు. నాగ చైతన్య తడాఖా సినిమా లో ఆమె తన నటతో ఆకట్టుకున్నారు. ఆండ్రియా సోషల్ మీడియా లోనూ చాలా చురుకుగా ఉంటారు. ఎప్పటికప్పుడు తన ఫోటోల ను షేర్ చేసి అలరిస్తూ ఉంటుంది. తాజాగా కూడా ఆమె కొన్ని ఫోటోలు షేర్ చేయగా అవి ఫ్యాన్స్ ని విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ఆమె తెలుపు రంగు డ్రెస్ లో మెరిసింది. టైట్ ఫిట్ మినీ డ్రెస్ లో ఆమె చాలా అందంగా కనిపిస్తున్నారు. తన



థైస్ షో చూస్తూ క్యూట్ గా ఫోటోల కు ఫోజులు ఇచ్చారు. వెనక మిర్రర్ కి ఉన్న లైట్ వెలుతురు లో ఆమె మరింత గ్లామరస్ గా కనిపిస్తుండటం విశేషం. ఇప్పటి వరకు ఆండ్రియా నటిగానే చాలా మందికి తెలుసు. కానీ ఈ బ్యూటీ కేవలం నటిగానే కాదు సింగర్ గానూ తన ప్రతిభను చాటారు. రామ్ చరణ్ నటించిన ఎవడు సినిమా లో ఓయే ఓయే పాట పాడి అలరించింది. ఇక నాగచైతన్య దడ సిని మా లోని దీవాళీ దీపాన్ని పాట ఎంత ఫేమసో తెలిసిందే. ఈ బ్యూటీ అటు సినిమాల్లో నటిస్తూ.. ఇటు సింగర్ గా తన సత్తా చాటుకుం టోంది. సినిమాల్లో మాత్రమే కాదు అప్పుడప్పుడు మ్యూజిక్ షోలు కూడా చేస్తూ ఆకట్టుకుంటూ ఉంటుంది. ఆమె దాదాపు 15 సంవత్స రాల పాటు మ్యూజిక్ నేర్చుకోవడానికి క్లాసుల కు వెళ్లిందట. అందుకే తాను ఈ విధంగా పాడగులుగుతున్నానంటూ గతంలో చెప్పడం విశేషం. ఆండ్రియా తమిళ సినీ పరిశ్రమ లోకి ముందుగా సింగర్గా ఎంట్రీ ఇచ్చారు. 2005లో 'కందా నాల్ ముదల్' అనే తమిళ సినిమా ద్వారా సినిమా రంగం లోకి అడుగుపెట్టారు.

కాగా ఆండ్రియా చాలా సార్లు వార్తల్లోకి ఎక్కిన సందర్భాల్లో ఉన్నాయి. తమిళ హీరోలు మ్యూజిక్ డైరెక్టర్లతో ఆమెకు లవ్ ఎఫైర్స్ ఉన్నాయని వార్తలు రావడం విశేషం. ముఖ్యంగా ధనుష్ ఫహాద్ ఫాజిల్ అనిరుధ్ రవిచందర్ వంటి వారితో ప్రేమాయణం నడిపింద ని అప్పట్లో వార్తలు గుప్పుమన్నాయి. అనిరుధ్ తో అయితే ఏకంగా ఫోటోలు కూడా బయట కు లీక్ అవ్వడం విశేషం.

## విడాకుల తర్వాతే సమంత బ్రాండ్ వాల్యూ మరింత పెరిగిందా..?

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రస్తుతం బ్యాక్ టూ బ్యాక్ ప్రాజెక్ట్స్ తో బిజీగా వుంది. తన వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకున్న విషయాల నుంచి బయటకు రావడానికి కెరీర్ మీదే ఫుల్ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఓవైపు వరుస సినిమాలు మరోవైపు కమర్షియల్ యాడ్స్ కు సైన్ చేస్తూ వస్తోంది. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' వెబ్ సిరీస్ తో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది సామ్. ఇక 'పుష్ప' సినిమాలో 'ఊ అంటావా' పాటలో తన వంపుసొంపులతో ఊపేసి బాలీవుడ్ లో అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ క్రమంలో అమ్మడి చేతిలోకి సరికొత్త బ్రాండ్లు వచ్చి చేరుతున్నాయి. సమంత క్రేజ్ ను క్యాష్ చేసుకోడానికి బ్రాండ్లు ఆమె వెంట నడుస్తున్నాయా.. లేక తనే బ్రాండ్ల వెంట పడుతుందా అనేది తెలియదు కానీ.. వారానికో కొత్త బ్రాండ్ ప్రకటనతో సందడి చేస్తోంది. లేటెస్టుగా స్పోర్టింగ్ యాప్ 'డ్రీమ్ 11' మరియు 'ఫార్చ్యూన్' సన్ ఫ్లవర్ ఆయిల్ లకు బ్రాండ్ అంబాసిడర్ గా సమంత నియమించబడింది. దీని కోసం ఆమెను పెద్ద మొత్తంలో చెల్లించినట్లు వార్తలు వస్తున్నాయి. కొన్ని వారాల



క్రితం సామ్ 'బ్లెండర్స్ ప్రైడ్ సౌత్' మరియు 'ఫాంటా' ప్రకటనలలో కనిపించింది సమంత. అంతకు ముందు 'మామఎర్త్' బ్రాండ్ ఆమెతో జతకట్టారు. వీటితో పాటుగా మరికొన్ని కంపెనీలు సామ్ ను ప్రచారకర్తగా నియమించుకుంటున్నాయి. గ్లామరస్ క్వీన్ గా వెలుగొందుతున్న సమంతకు ఇప్పుడు పాన్ ఇండియా వైడ్ పాపులారిటీ ఉండటం.. సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్ ఉన్నందున రోజురోజుకూ ఆమె బ్రాండ్ వాల్యూ పెరుగుతోందని అర్థం అవుతోంది. సామ్ నటించే సినిమాలు కూడా మంచి వసూళ్లను సాధిస్తున్నందున ఆమెని ప్రచారకర్తగా తీసుకోవడం తప్పకుండా ఆ బ్రాండ్లకు సహాయం చేస్తుందని భావించవచ్చు. ఏదైతేనేం సమంత ఇప్పుడు ఇటు సినిమాలు అటు యాడ్స్ తో రెండు చేతులా సంపాదిస్తోంది. సమంత ప్రధాన పాత్రలో గుణశేఖర్ తెరకెక్కించిన పాన్ ఇండియా మూవీ 'శాకుంతలం' త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.




## తమన్నా అందాల ఆరబోతపై ప్రియుడి రియాక్షన్





టాలీవుడ్ స్టార్ హీరోయిన్లలో తమన్నా కూడా ఒకరు. ఒకప్పుడు స్టార్ హీరోలందరితో నటించి మెప్పించిన ఈ బ్యూటీ ప్రస్తుతం తన దృష్టి మొత్తం వెబ్ సిరీస్ లపై పెట్టింది. ఇప్పటికే వరసగా రెండు వెబ్ సిరీస్ లలో మెరిసింది. రెండింటిలోనూ తన నటనతోబోల్డ్ సీన్స్ తో ఆకట్టుకుంది. కాగా ఆమె ఇటీవల సూపర్ స్టార్ రజినీకాంత్ సరసన ఆడి పాడింది. ప్రస్తుతం రజినీకాంత్ హీరోగా జైలర్ మూవీ ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అయ్యింది. కాగా ఈ మూవీ నుంచి ఇటీవల మొదటి సింగిల్ రిలీజ్ చేశారు. ఈ పాట విపరీతంగా అభిమానులను ఆకట్టుకుంటుంది. ఆ మూవీలో తమన్నా స్టెప్స్ మ్యూజిక్ అన్నీ హైలెట్ గా నిలిచాయి. తమన్నా హాట్ హాట్ స్టెప్పులతో మెస్మరైజింగ్ డ్యాన్స్తో షేక్ చేసింది. ఇప్పటికీ తమన్నా డ్యాన్స్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా తాజాగా ఆమె డ్యాన్స్ పై తమన్నా ప్రియుడు విజయ్ వర్మ కూడా స్పందించారు. తమన్నా డ్యాన్స్ పై పొగడ్తల వర్షం కురిపించారు. ఈ డ్యాన్స్ ని చూసి తమన్నా పై ప్రేమను కూడా కురిపించాడు. ఫైర్ అంటూ చెప్పేశారు. అంతేకాదు తమన్నా రజినీకాంత్ లను దేవుళ్లు అంటూ కామెంట్ చేయడం విశేషం. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్పై కళానిధి మారన్ తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ కామెడీ బ్యాక్ డ్రాప్లో వస్తున్న జైలర్ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. జైలర్ మూవీలో మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ సునీల్ కన్నడ స్టార్ హీరో శివరాజ్కుమార్ రమ్యకృష్ణ యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

తమన్నా ఇటీవలే నెట్ఫ్లిక్స్ ప్రాజెక్ట్ లస్ట్ స్టోరీస్ సీజన్ 2తో ప్రేక్షకుల ముందుకొచ్చింది. లస్ట్ స్టోరీస్ సీజన్ 2లో వన్ ఆఫ్ ది లీడ్ రోల్లో .. హాట్ హాట్ సీన్లలో నటించి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది తమన్నా. ఈ భామ ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి నటిస్తోన్న భోళాశంకర్లో ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది.

## బుట్టబొమ్మ ఏంటమ్మీ ఈ ప్రచారం పిచ్చి?







ఒకప్పుడు క్రికెట్ ని వంద కోట్ల మంది భారతీయులు ఎంతో మోజుపడి చూసేవారు. ఆ తర్వాత క్రికెట్ ఆటలో స్కామ్ లు కుట్రలు కుతంత్రాలు బయటపడ్డాక ఈ చెత్త గేమ్ చూడకూడదని చాలామంది నిర్ణయించుకున్నారు. నేటితరం కంటే కాస్త ముందుకు వెళితే అప్పటి తరం టీవీల్లో క్రికెట్ చూస్తున్నారంటే కేవలం ఆ క్షణం రిలీఫ్ కోసమే తప్ప భారత క్రికెటర్లపై గౌరవంతో కాదు!! వరుస పెట్టి భారత క్రికెట్ టీమ్ తో ముడిపడిన స్కామ్ లు బయటకు రావడంతో ఈ ఆటంటేనే చాలామందికి నీరసం వచ్చింది. అయితే క్రికెట్ అనే మాయ ఇంకా నేటితరంపైనా టీనేజర్లపైనా బలంగా పని చేస్తోందని ఇటీవలి టెలివిజన్ వీక్షణలు టీఆర్పీలు చెబుతున్నాయి. గంటల కొద్దీ సమయం కైంకర్యం అయిపోయే ఈ ఆటవల్ల నేటితరానికి ఎంతటి విలువైన సమయం వృధా అవుతోందో కూడా కొన్ని బలమైన విశ్లేషణలు సాగుతున్నాయి. క్రికెట్ పై మోహం మొత్తేసినట్టే ఇష్టానుసారం వాడేస్తున్న సోషల్ మీడియాపైనా మోజు తగ్గితే దాని పర్యవసానం ఎలా ఉంటుంది? ఇప్పట్లో గ్లామర్ కి ఆకర్షితులయ్యే యూత్ ని టీనేజర్లను ఆపలేం కానీ కాస్త నడివయసు లేట్ ఏజ్ బాబులకు సోషల్ మీడియాపై యావగింపు పెరుగుతోందన్నది వాస్తవం. ప్రతి చెత్త వీడియోని ఇప్పుడు సోషల్ మీడియాల్లో షేర్ చేస్తుంటే అది చూసేందుకు తమ విలువైన సమయాన్ని వృధా చేసుకుంటోంది నేటితరం. చాలా మంది కథానాయికలు ప్రతి చెత్తను ఇన్ స్టాలోకి తోసేస్తున్నారు. తాజాగా బుట్టబొమ్మ షేర్ చేసిన ఒక వీడియో అలానే ఉందని విమర్శలొస్తున్నాయి. సౌత్- నార్త్ ని ఏలుతూ కోట్లాది రూపాయల పారితోషికం అందుకునే పూజా హెగ్డే తన సంపాదనను మరింత పెంచుకునేందుకు ఇలాంటి చెత్త వీడియోలను ఇన్ స్టాలో షేర్ చేస్తోందంటూ ఒక వర్గం విమర్శిస్తోంది. పూజా హెగ్డే నిరంతరం సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. తన జీవితంలో ప్రతి ఎగ్జయిటింగ్ మూవ్ మెంట్ ని అభిమానుల కోసం షేర్ చేస్తోంది. అయితే తను లేదా ఇతర టెంప్టింగ్ కథానాయికలు షేర్ చేసే కొన్ని చెత్త వీడియోలు మాత్రం అందరికీ టైమ్ వేస్ట్ అని ఆవేదన వ్యక్తమవుతోంది. అలాంటివి షేర్ చేయకుండా క్లాసీ అనిపించేవి గమ్మత్తయిన ఆకర్షణీయమైన మంచి క్రియేటివిటీ ఉన్న వీడియోలు లేదా ఫోటోలను మాత్రమే షేర్ చేస్తే మంచిదని కూడా సూచిస్తున్నారు! తాజాగా పూజా ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసిన వీడియోలో గోల్ఫ్ ఆడుతూ కనిపించింది. స్టేడియంలో గోల్ఫ్ ప్రాక్టీస్ చేస్తున్నా! అంటూ బిల్డప్ ఇచ్చింది. ఈ పోస్టు "చ%ఝుఝుఎ చటఅతీర్అఎవస్త్రశీశ్రీటవతీ% .. చుట్టూ భయానకం.. కానీ బమ్మింగ్..." అంటూ వ్యాఖ్యను జోడించింది. కొత్త సంవత్సరం వెకేషన్ కోసం వెళ్లినప్పుడు గోల్ఫ్ ని ఆస్వాధించడం తప్పు కాదు కానీ చెత్త వీడియోలతో యువతరం విలువైన సమయాన్ని వృధా చేయడం నేరం! ఇలాంటి వీడియోల్లో మినిమం క్రియేటివిటీని అయినా కావాలని కోరుకుంటోంది యూత్. బుట్టబొమ్మ ప్రచారం పిచ్చిని తగ్గించుకోవాలని.. అన్ని చెత్త వీడియోలను దయచేసి పోస్ట్ చేయొద్దని మనవి చేసుకుంటున్నారు! ప్రస్తుతం వరుస ఫ్లాపుల్లో ఉన్న పూజా హెగ్డే తదుపరి మహేష్ సరసన త్రివిక్రమ్ సినిమాల్లో నటిస్తోంది. ఇకపై పూజా పూర్తిగా నటనపైనే దృష్టి సారిస్తే మంచిదని ఘట్టమనేని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

## చిలక పచ్చ కోక లో కట్టిపడేస్తున్న జాన్వీ పాప

దివంగత నటి శ్రీదేవి కూతురిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది జాన్వీ. ఆమె బాలీవుడ్ లో తెరంగేట్రం చేసి దాదాపు ఐదు సంవత్సరాలు అవుతున్నా చెప్పుకోతగిన హిట్ మాత్రం ఆమెకు దక్కలేదు. దీంతో తన దృష్టి దక్షిణాదిపై పెట్టింది. సౌత్ లో తనను తాను ప్రూవ్ చేసుకోవడానికి కసరత్తులు మొదలుపెట్టింది. ఇప్పటికే టాలీవుడ్ లో ఎన్టీఆర్ సరసన ఛాన్స్ కొట్టేసింది. ఈ దేవర మూవీ కనుక హిట్ అయితే తెలుగులో జాన్వీ కి ఆఫర్లు క్యూలు కట్టే అవకాశం లేకపోలేదు. ఈ మూవీకి ముందే ఆమెకు ఆఫర్లు వస్తున్నా ఆచితూచి అడుగులు వేయాలి అనే ఉద్దేశంతో తొందరపడి ఎలాంటి ఆఫర్లు ఒకే చేయడం లేదు. ఈ మూవీ రిసల్ట్ తర్వాతే తెలుగులో కొత్త సినిమా అంగీకరించాలని అనుకుంటోందట. ఇదిలా ఉండగా జాన్వీ సోషల్



మీడియాలో చాలా చురుకుగా ఉంటుంది. రెగ్యూలర్ గా ఫోటోలు షేర్ చేస్తూనే ఉంటుంది. ఆ ఫోటోలతో అభిమానులకు కనువిందు చేస్తూ ఉంటుంది. ఎప్పుడూ మోడ్రన్ డ్రెస్సులో దర్శనమిచ్చే జాన్వీ తాజాగా చీరలో మెరిసింది. ఆకు పచ్చని చీరకు బ్లూ కలర్ బ్లౌజ్ పెయిర్ చేసింది. చూడటానికి రెండు కళ్లు సరిపోవే అనట్లుగా ఉ ంది. ఈ ఫోటోలు చూస్తుంటే జాన్వీకి మోడ్రన్ దుస్తుల కంటే చీరలే చాలా బాగున్నాయే అనే ఫీలింగ్ కలుగుతోంది. కాగా ఈ ఫోటోలు ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇదిలా ఉండగా మరో వైపు ఈ బ్యూటీ తమిళంలోనూ అడుగుపెట్టాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. వ్ టుడే సినిమాతో సూపర్ హిట్ కొట్టిన హీరో ప్రదీప్ రంగనాథన్ సరసన జాన్వీ నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీకి విఘ్నేష్ శివన్ (నయనతార భర్త) దర్శకత్వం వహిస్తున్నారట. ఆయనే స్వయంగా వెళ్లి ఈ మూవీ కోసం జాన్వీతో మాట్లాడట. దీంతో జాన్వీ వెంటనే ఒకే చెప్పినట్లు తెలుస్తోంది. బ్యాలెన్స్ గా అటు తెలుగులోనూ ఇటు తమిళంలోనూ తన కెరీర్ ని కంటిన్యూ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వరసగా రెండు హిట్లు పడితే ఇక దక్షిణాదిన జాన్వీ కెరీర్ కి ఎలాంటి డోకా లేదనే చెప్పొచ్చు.

## ఫోటోటాక్ : వావ్ రకల్... ఆ చూపుకు ఎంతటి వాడైనా పడిపోవాల్సిందే

కెరటం అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ గా 2011 సంవత్సరంలో రకుల్ ప్రీత్ సింగ్ పరిచయం అయ్యింది. ఆ సినిమా తో రకుల్ కి పెద్దగా గుర్తింపు దక్కలేదు. కాని 2013 సంవత్సరంలో వచ్చిన వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ సినిమా తో అనూహ్యంగా రకుల్ ప్రీత్ కు టాలీవుడ్ లో మంచి గుర్తింపు దక్కింది. ఆ సినిమా సక్సెస్ అవ్వడంతో ఈ అమ్మడు టాలీవుడ్ లో వరుస సినిమాలతో బిజీ అయ్యింది. అంతకు ముందు వరకు కన్నడం మరియు తమిళ సినిమాలు చిన్నవి చేసుకుంటూ కెరీర్ ను నెట్టుకుంటూ వచ్చిన రకుల్ ప్రీత్ సింగ్ కు తెలుగులో పెద్ద హీరోలకు జోడీగా నటించే అవకాశం దక్కింది. వరుసగా సినిమాల్లో నటిస్తూ అనూహ్యంగా ఈ అమ్మడు స్టార్ హీరోలకు జోడీగా నటించే స్థాయికి చేరింది. దాదాపు అయిదు సంవత్సరాల పాటు స్టార్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ గా ఈ అమ్మడు స్టార్ హీరోయిన్ గా కొనసాగింది. ఇప్పుడు బాలీవుడ్ లో మోస్ట్ బిజీ హీరోయిన్ గా మారిపోయింది. అక్కడ ఒక్కటి కాదు రెండు కాదు ఏకంగా ఆరు ఏడు సినిమా లతో రాబోతుంది. కొన్ని సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉండగా.. కొన్ని సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. మరి కొన్ని చర్చల దశలో ఉన్నాయి. వీటిలో రెండు మూడు సక్సెస్ అయినా కూడా రకుల్ ప్రీత్ సింగ్ కి బాలీవుడ్ లో స్టార్



హీరోలకు జోడీగా నటించే అవకాశాలు రావచ్చు అంటున్నారు. రికార్డ్ స్థాయిలో సినిమాలు చేస్తున్న రకుల్ ప్రీత్ సింగ్ అందాల ఆరబోత విషయంలో కూడా రికార్డ్ సృష్టిస్తుంది. తన ఇన్ స్టా పేజీలో రెగ్యులర్ గా అత్యంత అదమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా మిలియన్ ల కొద్దీ తనకు ఉన్న ఫాలోవర్స్ ను ఆనందింపజేస్తుంది. ఆమె హాట్ ఫోటో షూట్స్ కుర్ర కారుకు మత్తెక్కించేవిగా ఉంటాయి. ప్రతి ఒక్క ఫోటో షూట్ లో కూడా వావ్ అనిపిస్తూ.. అంతకు ముందు ఫోటో షూట్ కంటే ఇంకా ఎక్కువ అందంగా ఉంది అనిపించుకుంటుంది. తాజాగా ఈ కలర్ ఫుల్ కాస్ట్యూమ్ లో రకుల్ సందడి చేసింది. లైట్ గా క్లీ వేజ్ షో చేస్తూ అలా ఓర కంట చూస్తున్న రకుల్ ప్రీత్ సింగ్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ చూపుకు ఎంతటి మగాడైనా పడి పోవాల్సిందే. అమ్మాయిలు కూడా ఈ అందమైన అమ్మాయిని చూసి కుళ్లుకోవాల్సిందే అంటున్నారు. ఇంత అందగత్తెను టాలీవుడ్ స్టార్స్ మరియు ఫిల్మ్ మేకర్స్ ఎందుకు దూరం పెట్టారో అర్థం కావడం లేదని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రకుల్ ప్రీత్ సింగ్ బాలీవుడ్ లో బిజీ అయితే తెలుగు సినిమా పరిశ్రమలో సినిమాలు చేయదేమో అంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరు మాత్రం ఆమె సినిమాలు హిందీ నుండి తెలుగు లో డబ్ అవ్వాలని కోరుకుంటున్నారు. మొత్తానికి రకుల్ ఫోటో లతో మరోసారి టాలీవుడ్ లో కూడా రచ్చ చేస్తుంది అనే నమ్మకంను కలిగిస్తుంది. అది ఎప్పుడు అనేది చూడాలి.




# 3 పంటలా.. 3 గంటలా..? రైతులు తేల్చుకోవాలి

హైదరాబాద్: రైతుల ఉచిత విద్యుత్‌కు సంబంధించి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. "కేసీఆర్ నినాదం.. మూడు పంటలు. కాంగ్రెస్ విధానం.. మూడు గంటలు. భాజపా విధానం.. మతం పేరిట మంటలు. మూడు పంటలు కావాలా? మూడు గంటలు కావాలా? మతం పేరిట మంటలు కావాలా? అనేది రైతులు తేల్చుకోవాలి. తెలంగాణ రైతులు తేల్చుకోవాల్సిన తరుణమిది" అని కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ నోట.. రైతులకు రెండో ప్రమాద హెచ్చరిక. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తామన్నారు. ఇప్పుడు 3 గంటల విద్యుత్ చాలని.. రైతుకు మూడుపూటలా విద్యుత్ ఎందుకు అంటున్నారు. ముమ్మాటికీ ఇది సన్న, చిన్న కారు రైతును అవమానించడమే. నోట్లు తప్ప రైతుల పాట్లు తెలవని రాబందును నమ్మవద్దు. మరోసారి మూడు గంటల మాటెత్తితే రైతుల చేతిలో మాడు పగలడం ఖాయం. రైతును రాజును చేసే మనసున్న సీఎం కేసీఆర్ కావాలా? మూడు గంటల విద్యుత్ చాలన్న మోసకారి రాబందు కావాలో రైతులకు తెలుసు" అని కేటీఆర్ అన్నారు. "తెలంగాణలో 95 శాతం మంది రైతులకు 3 ఎకరాల్లోపు భూమి ఉన్నందున అందులో పంటల సాగుకు 3 గంటలసేపు కరెంటు ఇస్తే నీరందించవచ్చు. మొత్తంగా వ్యవసాయానికి రోజూ 8 గంటల సేపు విద్యుత్తు చాలు" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

# రేవంత్ క్షమాపణ చెప్పేవరకు కాంగ్రెస్ నేతలను తిరగనీయొద్దు: ఎమ్మెల్సీ కవిత




హైదరాబాద్: రైతులు సంతోషంగా బతకాలంటే పంటలకు నాణ్యమైన విద్యుత్ ఉండాలని భారాస ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నగరంలోని విద్యుత్‌సౌధ వద్ద భారాస ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భారాస నేతలు, కార్పొరేటర్లు పాల్గొని రేవంత్, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రైతులకు సీఎం కేసీఆర్ నాణ్యమైన విద్యుత్.. కాళేశ్వరం నీళు ఇస్తున్నారని చెప్పారు. తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు పథకం దేశంలో ఎక్కడా లేదన్నారు. రేవంత్ చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ బోగస్ అని అర్థమైందని ఆమె వ్యాఖ్యానించారు. "60 ఏళ్ల పాటు దేశంలో అధికారంలో కొనసాగిన కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బందులు పడ్డారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఎందుకు ఇవ్వొద్దు? పరిశ్రమలకు ఇవ్వొద్దు అనే ధైర్యం రేవంత్‌కు ఉందా?మూడు పూటలా అన్నం పెట్టే రైతులకు 3 గంటలే విద్యుత్ ఇవ్వాలనే రేవంత్‌ను ఊరు పొలిమేర వరకు తరిమికొట్టాలి. రైతులకు ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలి. రేవంత్ క్షమాపణ చెప్పే వరకు కాంగ్రెస్ నేతలను గ్రామాల్లో తిరగనీయొద్దు" అని కవిత మండిపడ్డారు.

# ఉచిత కరెంట్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యల మీద మండిపడ్డ బీఆర్ఎస్.. రెండోరోజూ నిరసనలు




వ్యవసాయానికి 3 గంటల కరెంట్ సరిపోతుందని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నారు. బీఆర్ఎస్ సర్కార్ ఇస్తున్న ఉచిత కరెంట్‌కు ఉరి వేస్తారా? అంటూ మండిపడ్డారు. రేవంత్ వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజు ఆందోళనలు చేపట్టారు. ఊరూరా రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలు దహనం చేశారు. రేవంత్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ విద్యుత్ సౌధ వద్ద నిర్వహించిన ధర్నాలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొని నిరసన తెలియజేశారు. రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తాలో నిర్వహించిన నిరసనల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. బోయిన్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.

# కేంద్రం సొమ్ముతో సోకుచేసుకోడానికి సిగ్గుగా లేదా?




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తీగలగుట్టపల్లి 'ఆర్వోబీ నిర్మాణంలో మీ వాటా ఎంత?' అని ప్రశ్నించారు. తమ ఘనతేనంటూ గొప్పలు చెబుతున్న బీఆర్ఎస్ నేతలు 8 ఏళ్లుగా ఎందుకు సాధించలేకపోయారని నిలదీశారు. కేంద్రం ఆమోదించి 8 నెలలైనా ఇంతవరకు ఎందుకు జాప్యం చేశారన్నారు. సొమ్ము కేంద్రానిదైతే... సోకు మీరు చేసుకోవడానికి సిగ్గనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఆర్వోబీ నిర్మాణ ఖర్చంతా కేంద్రమే భరించేలా ఒప్పించింది తానేనని అన్నారు. శంకుస్థాపనకు ఆహ్వానించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ నేతలకు చిత్తశుద్ధి ఉంటే వరంగల్-కరీంనగర్, ఎల్కతుర్తి-సిద్దిపేట, కరీంనగర్-జగిత్యాల రహదారి విస్తరణ పనులకు 8 ఏళ్లుగా నిధులెందుకు సాధించలేకపోయారని ప్రశ్నించారు. కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం నిధులెందుకు తీసుకురాలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు. కరీంనగర్ ప్రజలకు ఎవరెంటో అన్నీ తెలుసునని బండి సంజయ్ అన్నారు.

# నాడు చంద్రబాబుకు పట్టిన గతే.. రేవంత్ రెడ్డికీ పడుతుంది : మంత్రి శ్రీనివాస్ గౌడ్



గతంలో వ్యవసాయం దండగ అని చంద్రబాబు అన్నాడని.. ఇవాళ రైతులకు ఉచిత కరెంట్ ఎందుకని రేవంత్ రెడ్డి అంటున్నారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురుశిష్యులు ఇద్దరూ ఒక్కటే అని ఆయన విమర్శించారు. ఆనాడు కరెంట్ అడిగిన రైతులను లాఠీలతో తొక్కిస్తే బాబుకు ఏం గతి పట్టిందో.. ఈనాడు రేవంత్ రెడ్డికి కూడా అదే గతి పడుతుందని జోస్యం చెప్పారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపాయి.

ఈ సందర్భంగా తెలంగాణ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు మాత్రమే సరిపోతుందని అనడం రైతులను అవమానించడమేనని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో రేవంత్ రెడ్డి వక్రబుద్ధి బయటపడిందని అన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు కోరుకుంటున్నాయని తెలిపారు. రైతుల జోలికి వస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.




# పాపం పసివాడు.. నేడే చూడండి..!

హైదరాబాద్ : టైటిల్ చూసి మూవీ పోస్టర్ అనుకునేరు.. మూవీ పోస్టర్ కాదు కానీ లాంటిది. మూవీ ప్రమోషన్ మాదిరిగానే తెలంగాణలోని విపక్ష పార్టీలు ఓ పోస్టర్‌ను వైరల్ చేస్తున్నాయి. పాపం పసివాడు వచ్చేసి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అని పోస్టర్ ద్వారా తెలుస్తోంది.. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వచ్చేసి బీజేపీ అని పోస్టర్‌లో ప్రకటించేశారు.

ఆ పోస్టర్ చూడమంటున్నదేమో విపక్ష పార్టీలు. ఇప్పుడు తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో ఓ పోస్టర్ తెగ వైరల్ అవుతోంది. దానిలో ప్రధాని మోదీ.. తెలంగాణ సీఎం కేసీఆర్‌ని ఎత్తుకుని లాలిస్తుంటారు. కేసీఆర్ చేతిలో ఒక పుల్ల ఐస్ కూడా ఉంది. 'నేడు చూడండి..! పాపం పసివాడు' అంటూ పోస్టర్‌ను పలు ప్రాంతాల్లో అంటించారు. దీనిని జనం ఆసక్తిగా తిలకిస్తున్నారు. 'మా మీద ఉన్న అవినీతి కేసులు లేకుండా చూడండి. మీకు బి- టీంగా నేను ఉంటా అని కేసీఆర్ చెబుతున్నట్టుగా ఉంది. మొత్తానికి గత కొంతకాలంగా బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య లోపాయికారి ఒప్పందం ఏదో జరిగిందంటూ తెలంగాణలో తెగ ప్రచారం జరుగుతోంది. దీనికి కారణం లేకపోలేదు. ఎమ్మెల్సీ కవితను ఢిల్లీ లిక్కర్ స్కాంలో నేడో రేపో అరెస్ట్ చేయడం ఖాయం అనుకున్నారంతా కానీ అది జరగలేదు. మరోవైపు సీఎం కేసీఆర్, కేటీఆర్ తదితరులు బీజేపీపై విమర్శల జోరును మొత్తానికే తగ్గించేశారు. అది చాలదన్నట్టు బీజేపీ కూడా ఉన్నఫళంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను తప్పించి ఆయన స్థానంలో కిషన్ రెడ్డి నియామకం వెనుక పెద్ద స్కెచ్చే ఉందని విపక్షాలు అంటున్నాయి. బండి సంజయ్ దూకుడుగా వ్యవహరిస్తారు. అది అప్పట్లో బీఆర్ఎస్ ప్రత్యర్థి కాబట్టి దూకుడు ఓకే కానీ ఇప్పుడు మిత్రుడు అయ్యాక అంత దూకుడు పనికి రాదు. అందుకే ఆయనను అధ్యక్షుడిగా తొలగించారని సోషల్ మీడియా టాక్. ఏమైతేనేమి విపక్షాలు మాత్రం బీఆర్ఎస్, బీజేపీ భాయి భాయి అన్న విషయాన్ని జనంలోకి తీసుకెళ్లడానికి బాగా ప్రయత్నిస్తున్నాయి.




## అలాంటి పరిస్థితులను నేనెప్పుడూ చూడలేదు.. ఆ బాధను మాటల్లో చెప్పలేను: హిమాన్షురావు


హైదరాబాద్: గౌలిదొడ్డిలోని కేశవనగర్ ప్రభుత్వ పాఠశాలకు తొలిసారి వచ్చినపుడు తన కళ్ల నుంచి నీళ్లు వచ్చాయని సీఎం కేసీఆర్ మనవడు హిమాన్షురావు అన్నారు. ఆడపిల్లలకు సరైన బాత్‌రూమ్‌లు లేవని.. స్కూల్లో మెట్లు కూడా సరిగా లేవన్నారు. అలాంటి పరిస్థితులను తానెప్పుడూ చూడలేదని చెప్పారు. తాను సేకరించిన నిధులతో పాఠశాలలో చేపట్టిన ఆధునికీకరణ పనులను మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి హిమాన్షురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "ఇది నా మొదటి పబ్లిక్ స్పీచ్. కొత్తవారితో మాట్లాడుతున్నట్లు లేదు.. నా కుటుంబం ముందు మాట్లాడుతున్నట్లు ఉంది. దాదాపు ఏడాది నుంచి వచ్చి పని ఎలా జరుగుతుందో చూసి వెళ్లేవాడిని. కేసీఆర్ మనవడిని కదా.. ఏదైనా నార్మల్‌గా చేసే అలవాటు లేదు.. గొప్పగా చేయాలన్నదే ఆలోచన. నిధులు సేకరించి పేదలకు ఉపయోగపడేలా ఖర్చు చేయాలనుకున్నాం. మా స్కూల్ ప్రోగ్రాంలో భాగంగా ఈ స్కూల్‌కి గోడలు కట్టించాలి అన్నారు. మొదటిసారి ఇక్కడికి వచ్చినపుడు నా కళ్ల వెంట నీళ్లు వచ్చాయి. ఆడపిల్లలకు సరైన బాత్‌రూమ్‌లు లేవు.. మెట్లు కూడా సరిగా లేవు. అలాంటి పరిస్థితులు నేను ఎప్పుడూ చూడలేదు. ఆ బాధను నేను మాటల్లో చెప్పలేను. స్కూల్‌కు గోడలు కట్టడం కాదు చాలా చేయాలి అనుకున్నాం. రెండు పెద్ద ఈవెంట్స్ చేసి రూ.40లక్షలు సేకరించాం. ఆ తర్వాత సీఎస్ఆర్ కింద మధుసూదన్ సహాయం చేశారు.

ఈ స్కూల్‌కి మంచి చేయడానికి నాకు మా తాత కేసీఆరే స్ఫూర్తి. చదువుకున్న సమాజం.. పేదరికాన్ని అరికట్టే ఉపాయం ఉంటుంది అని చెప్పారు. అందుకే ఈరోజు ఈ స్కూల్‌కి సహాయం చేశాను. మా నాన్న కూడా నా గ్రేడ్ చదువులో తగ్గినా.. వందమందికి సహాయం చేసే అవకాశం ఉంటే చేయాలని చెప్పారు. నా కుటుంబం, స్నేహితుల వల్లే ఇది సాధ్యమైంది" అని హిమాన్షు అన్నారు.




కొరియా ద్వీపకల్పం మరోసారి ఉద్రిక్తంగా మారింది. అమెరికాను బెదిరించిన మర్నాడే ఉత్తర కొరియా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి పరీక్ష నిర్వహించింది. ఈ విషయాన్ని జపాన్, ఉత్తరకొరియా అధికారులు ధ్రువీకరించారు. ఈ క్షిపణి జపాన్ సముద్ర జలాల్లో బుధవారం ఉదయం పడింది. ఇది తూర్పు దిశగా కొంత సేపు పయనించి జపాన్ కాలమానం ప్రకారం ఉదయం 11.15 సమయంలో సముద్ర జలాల్లో పడింది. ఈ విషయాన్ని ఆ దేశ కోస్ట్‌గార్డ్ వెల్లడించింది. ఉ.కొరియా నియంత్ కిమ్ సోదరి యో జోంగ్ నిన్న అమెరికాపై నిప్పులు చెరిగారు. వాషింగ్టన్‌కు చెందిన నిఘా విమానాలు తమ భూభాగంలోకి చొరబడితే కూల్చేస్తామని హెచ్చరించారు. దీంతో ప్యాంగ్యాంగ్ దూకుడును తట్టుకొనేందుకు దక్షిణ కొరియా, అమెరికా, జపాన్ దేశాలు కూడా సంయుక్త యుద్ధ విన్యాసాలను పెంచాయి. మరోవైపు ఉత్తర కొరియా ఆరోపణలను అమెరికా తోసిపుచ్చింది. తమ సైనిక గస్తీ కార్యకలాపాలు సరిహద్దులకు లోబడే జరుగుతున్నాయని పేర్కొంది. 2022 ఆరంభం నుంచి ఇప్పటివరకు ఉత్తర కొరియా మొత్తం 100కి పైగా క్షిపణి ప్రయోగాలు నిర్వహించింది. ఈ ఏడాది ఓ నిఘా ఉపగ్రహ ప్రయోగానికి కూడా ఉత్తరకొరియా విఫలయత్నం చేసింది. గత ఏప్రిల్‌లో అత్యంత శక్తిమంతమైన ఖండాంతర క్షిపణిని ప్రయోగించింది. అమెరికా ప్రధాన భూభాగాన్ని తాకే శక్తి ఉన్న ఐసీబీఎంలను ఉ.కొరియా అభివృద్ధి చేస్తోంది.

# తెలంగాణలో 8 శాతం పెరిగిన పచ్చదనం: మంత్రి కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణలో పచ్చదనం 8 శాతం పెరిగినట్లు మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో గ్రీనరీ పెరగలేదని, తెలంగాణలో గ్రీనరీ పెరిగిన శాతం అత్యధికంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణలో పచ్చదనం మూడు శాతం పెరిగినట్లు గ్రీన్ బెల్ట్ అండ్ రోడ్ ఇన్‌స్టిట్యూట్ ప్రెసిడెంట్ ఎరిక్ సోల్‌హెమ్ ఓ ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో తెలంగాణ సర్కార్ చేపడుతున్న హరితహారాన్ని ఆయన ప్రశంసించారు. తెలంగాణ తన గ్రీనరీని మూడు శాతం పెంచుకుందని, ఇదో అద్భుతమైన పయత్నమని ఆయన అన్నారు. ఎరిక్ తన ట్వీట్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. ఇలాంటి హై క్వాలిటీ ఉన్న మొక్కల్ని నాటడడం వల్లే ఆ గ్రీనర్ పెరిగినట్లు ఎరిక్ తన ట్వీట్‌లో అభిప్రాయపడ్డారు. ఆరోగ్యకరమైన మొక్కల్ని మళ్లీ ఈ సీజన్‌లోనూ నాటేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు ఎరిక్ తన ట్వీట్‌లో తెలిపారు. అయితే గ్రీన్ బెల్ట్ ప్రెసిడెంట్ ఎరిక్ చేసిన ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ రిప్లై ఇచ్చారు. మూడు శాతం కాదు, నిజానికి తెలంగాణలో 8 శాతం గ్రీనరీ పెరిగినట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. దేశంలోనే ఇది హయ్యెస్ట్ అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని సుమారు 12,769 గ్రామాల్లో, 142 మున్సిపాల్టీల్లో నర్సరీలు ఉన్నాయని, అన్ని నర్సరీలు ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 16,000 నర్సరీలు ఉన్నట్లు మంత్రి కేటీఆర్ వెల్లడించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com